ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 115, పేజీలు - 08

సోమవారం,అక్టోబర్ 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కమల వికాసమేనా.?

## తెలంగాణాలో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందా.!

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఏకైక లేదా సంపూర్ణ ప్రత్యామ్నాయంగా మారడానికి ఇంకా మిశ్రమ ఫలితాలు, సవాళ్లు ఎదుర్కొంటోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు సాధించి 35 శాతం ఓట్లతో బలమైన పునాది వేసుకున్నప్పటికీ, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే వెనుకబడి మూడో స్థానానికే పరిమితమైంది.ప్రజల్లో మరియు రాజకీయ క్షేత్రంలో బీజేపీ స్థానాన్ని పదిలం చేసుకునే ప్రయత్నిస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఎనిమిది స్థానాలు, పెరిగిన ఓట్ల శాతం ఆ పార్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. కొన్ని పట్టణ, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ప్రజలు కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని చూసి ఓటేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగే ప్రయత్నం అప్పటి నుంచే మొదలు పెట్టింది. బీఆర్ఎస్ బలహీనపడిన సమయాల్లో, కాంగ్రెస్‌కు తామే అసలైన ప్రత్యామ్నాయం అని, హైడ్రా వంటి ప్రజా వ్యతిరేకత ఉన్న అంశాలపై పోరాడుతూ బీజేపీ ప్రజల్లోకి వెళ్తోంది.

### క్షేత్రస్థాయి సవాళ్లు

2026 ప్రారంభంలో జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ ఘన విజయం సాధించగా, బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ దాదాపు 20శాతం ఓట్లను కోల్పోయి మూడో స్థానానికి పడిపోయింది. స్థానిక ఎన్నికల్లో త్రిముఖ పోటీ వల్ల బీజేపీ కేవలం ఓట్లను చీల్చే 'స్పాయిలర్' గానే మారిందని విశ్లేషకులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో బలమైన క్యాడర్, ప్రజాకర్షణ గల స్థానిక నాయకులు లేకపోవడం బీజేపీకి పెద్ద మైనస్. అలాగే తెలంగాణ ప్రాంతీయ సెంటిమెంట్‌కు, బీజేపీ జాతీయవాద విధానాలకు మధ్య ఉన్న వ్యత్యాసం కూడా ప్రభావం చూపుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పాలన, అవినీతితో ప్రజలు విసిగిపోయారని, సర్వేల ప్రకారం తామే రాబోయే కాలంలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని, ఏకైక ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొంటున్నారు.

### ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు

తెలంగాణలో ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు నాయకత్వాన్ని కూడా పెంచుకోవడం

2లో..

# కన్నడిగులను పక్కనపెట్టొద్దు

## - ఐటీ కంపెనీలకు సీఎం డీకేశి వార్నింగ్



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** బెంగళూరులోని ఐటీ, వివిధ ప్రైవేటు సంస్థల్లో కన్నడిగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో తీవ్ర వివక్ష జరుగుతోందనే ఆరోపణలు కన్నడ నాట చర్చనీయాంశమౌతోన్నాయి. స్థానికులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెడుతున్నారనే ఫిర్యాదులను కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఐటీ, ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలకు హెచ్చరికలు సైతం జారీ చేశారు. కన్నడిగుల ప్రయోజనాలు, వారి హక్కులను దెబ్బతీసేలా ఏ ప్రైవేటు

2లో..

# పరిషత్ ఎన్నికల అర్హుల జాబితా విడుదల

## - 50,815 నామినేషన్లు చెల్లుబాటు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న పరిషత్ (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికలకు సంబంధించి అధికారులు నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి అర్హుల జాబితాను విడుదల చేశారు. పరిశీలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 50,815 నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అధికారుల పరిశీలనలో పలువురి నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో వారిని అర్హులుగా ఎన్నికల సంఘం ప్రకటించింది.

### ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా నామినేషన్ల వివరాలు

రాష్ట్రంలోని 9,829 ఎంపీటీసీ (ఎంపీటీసీ) స్థానాలకు గాను మొత్తం 40,045 నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయి. అదేవిధంగా 659 జడ్పీటీసీ (జడ్పీటీసీ) స్థానాలకు సంబంధించి 4,770 నామినేషన్లు చెల్లుబాటు అవుతాయని ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. ఈ మేరకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హుల జాబితాను విడుదల చేశారు. మొత్తం 50,815 నామినేషన్లు చెల్లుబాటు అవుతున్నాయి. టీడీపీ నుంచి 19,760 మంది ఎంపీటీసీ అభ్యర్థులు అర్హులు, వైసీపీ నుంచి 17,726 మంది అభ్యర్థులు, జనసేన నుంచి 4330 మంది, బీజేపీ నుంచి 1049 మంది అభ్యర్థులు, కాంగ్రెస్ నుంచి 439, ఇండిపెండెంట్ 2012 మంది అభ్యర్థులను అర్హులుగా అధికారులు ధృవీకరించారు. పోటీ నుంచి తప్పుకోవాలని భావించే అభ్యర్థులు అక్టోబర్ 27వ సాయంత్రం వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి అవకాశం కల్పించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి కావడంతో ప్రస్తుతం అభ్యర్థుల ఉపసంహరణ, తుది పోరుపై దృష్టి సారించారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న ఎన్నికలు జరగనున్నాయి. 5న ఓట్లు లెక్కించి విజేతల్ని ప్రకటించనున్నారు. అయితే నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉండటంతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తేదీని వాయిదా వేసే అవకాశం ఉంది.

# హైదరాబాద్ ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

## - రూ.600తో వారం రోజుల పాటు అన్‌లిమిటెడ్ ప్రయాణం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో బస్సుల్లో ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ఒక శుభవార్త అందించింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా అన్‌లిమిటెడ్ బస్ పాస్‌ను ప్రవేశపెట్టింది. కేవలం రూ.600 చెల్లించి ఈ పాస్‌ను పొందడం ద్వారా ఏడు రోజుల పాటు నగరంలో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటులో ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సులతో పాటు ఏసీ బస్సుల్లోనూ ఈ పాస్‌తో ప్రయాణించేందుకు అనుమతి ఉంటుందని టీజీఎస్‌ఆర్టీసీ స్పష్టం చేసింది. అయితే, శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని అధికారులు తెలిపారు.

2లో..

# తుపానును సమర్ధవంతంగా ఎదుర్కొందాం

- ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు
- తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష
- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- అధికారులకు కీలక ఆదేశాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా బలపడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీశ్ గుప్తా, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీ అధికారులతో పాటు వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, హోం, వైద్యారోగ్య, పౌరసరఫరాలు, పురపాలక, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పక్కా ప్రణాళికతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 850 కిలోమీటర్లు, కాకినాడకు 930 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం వేగంగా బలపడుతోంది. ఇది అక్టోబర్ 26 ఉదయానికి తుపానుగా, అదే రోజు రాత్రికి తీవ్ర తుపానుగా, 27వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అక్టోబర్ 28న ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం కోనసీమ-యానాం-కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించారు.

### భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలపై గాలులు, వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా సగటున 292.55 మి.మీ.,

2లో..

# ధర్మపురి అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

## - రూ.2.57 కోట్లతో మంత్రులు శంకుస్థాపన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ధర్మపురి అభివృద్ధికి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మన్ కుమార్‌లు ఆదివారం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి బస్ స్టేషన్ ఆధునీకరణ పనులకు రూ.2.57 కోట్లతో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్టుగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రార్థించినట్టుగా చెప్పారు. ప్రజాపాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని బాసర నుంచి భద్రాచలం

2లో..

# ప్రధానిపై మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

## - ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి. బీహార్ రాజధాని పాట్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు ఖర్గే తీరును తీవ్రంగా ఖండించారు. బీహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సభలో ఖర్గే ప్రసంగిస్తుండగా, ప్రేక్షకుల మధ్యలో ఉన్న సంతోష్ సింగ్ అనే వ్యక్తి "మోదీ నహీ జాయేగా" (మోదీ అధికారంలోంచి దిగరు) అని గట్టిగా అరిచాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఖర్గే, "మోదీ కా బాప్ భీ జాయేగా" (మోదీ ఏంటి.. మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ మూడుసార్లు వ్యాఖ్యానించారు. ఆ వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలు సంతోష్ సింగ్ ను చుట్టుముట్టి, చితకబాది సభా ప్రాంగణం నుంచి బయటకు పంపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం ముదిరింది. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా స్పందించారు.

2లో..

# రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారింది

- హామీలు గాలికొదిలి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని విమర్శ - సీఎం రేవంత్ పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ
- 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో ఎన్నికలకు ముందు 420 హామీలిచ్చి, ఇప్పుడు ప్రజలకు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ, వెయ్యి రోజులైనా హామీల అమలు ఏది? అని ప్రశ్నించారు. దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణ జాడ దొరకడం లేదా? అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ నుంచి ఆయనకు ముట్టే సొమ్ముల కోసమే రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎదుర్కొనే దమ్ము బీజేపీకి లేదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో వరుస స్కామ్‌లు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే తిట్లు, అక్రమ కేసులతో బెదిరింపులు దిగుతున్నారని ఆరోపణలు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నేత జిబ్రాన్ షరీఫ్ ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, తెలంగాణను తిరిగి నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విభజనలు

2లో..

# కమల వికాసమేనా.?

బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి రానున్న కాలంలో సవాల్ అని చెప్పక తప్పదు. ప్రజలు కూడా బీజేపీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉంటే డబుల్ ఇంజిన్ సర్కార్ తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తే కమలం పార్టీకి అధికారం చేరువవుతుంది. తెలంగాణలో పోటీ ఎప్పుడూ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని, బీజేపీ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి వారు అంటున్నప్పటికీ ప్రజలు ఇచ్చే తీర్పునకు అందరూ కట్టుబడి ఉండాల్సిందే. ప్రస్తుతానికి తెలంగాణ ప్రజలు బీజేపీని ఒక బలమైన శక్తిగా గుర్తిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి అధికార ప్రత్యామ్నాయంగా మార్చడానికి ఇంకా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ చెబుతుండటంతో త్రిముఖ పోరు ఆసక్తికరంగా ఇంకా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ చెబుతుండటంతో త్రిముఖ పోరు ఆసక్తికరంగా మారనుంది. అందుకు అవసరమైన కసరత్తును ఇప్పటి నుంచే ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

# కన్నడిగులను పక్కనపెట్టొద్దు

సంస్థ వ్యవహరించినా చట్టపరమైన తీవ్ర పర్యవసానాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటక గడ్డపై కన్నడిగుల ప్రయోజనాలే అత్యున్నతమైనవని, స్థానిక నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత ఇవ్వకుండా పక్కనబెట్టడం ఎంతమాత్రం తగదని ఆయన తేల్చి చెప్పారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియల్లో స్థానిక అభ్యర్థులను తిరస్కరిస్తున్నారంటూ ఇటీవల వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నామని డీకే శివకుమార్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఇటీవల సోషల్ మీడియాలో కర్ణాటకకు చెందిన ఓ యువతి పంచుకున్న వీడియో దీనికి ప్రధాన కారణం. బెంగళూరులోని ఐటీ సంస్థలు తమ నియామక ప్రక్రియల్లో అనుసరిస్తున్న తీరు, స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఈ వీడియో ద్వారా ఆమె వెల్లడించింది. ఇది వైరల్ అయింది. ఈ అంశం.. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కన్నడ సంఘాలు, స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమైంది. ఉద్యోగార్థులు తమ రెజ్యూమ్‌లలో లేదా బయోడేటాలో మాతృభాషగా కన్నడ అని పేర్కొంటే, ఆ దరఖాస్తులను తిరస్కరిస్తోన్నారని ఆ యువతి ఆరోపించారు. బెంగళూరులోని స్థానిక ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లి తక్కువ వేతనాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అర్హత కలిగిన కన్నడిగులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. దీనిపై ప్రభుత్వం, కన్నడ పరిరక్షణ సంఘాలు జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ పరిణామాలపై డీకే శివకుమార్ స్పందించారు. కన్నడిగుల హక్కులు, స్వాభిమానం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భారత టెక్ క్యాపిటల్ గా బెంగళూరు ప్రసిద్ధి చెందిందంటే, దానికి కారణం.. ఇక్కడి భూమి, మౌలిక సదుపాయాలు, స్థానిక యువత కష్టం, నైపుణ్యాలే మూలకారణమని గుర్తుచేశారు. స్థానిక యువత ప్రతిభపై తమకు పూర్తి నమ్మకం ఉందని, వారిని చులకనగా చూడటానికి వీల్లేదని పేర్కొన్నారు. మాతృభాష లేదా ప్రాంతం ఆధారంగా ఐటీ, ఇతర ప్రైవేటు సంస్థలు అభ్యర్థుల పట్ల పక్షపాతం చూపడం తీవ్రమైన విషయమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఏ కంపెనీ అయినా ఉద్దేశపూర్వకంగా స్థానిక కన్నడిగులను పక్కనబెట్టినట్లు నిరూపితమైతే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నియామకాల్లో నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తుపానును సమర్థవంతంగా ఎదుర్కొందాం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 281.17 మి.మీ., విశాఖపట్నంలో 253.87 మి.మీ., శ్రీకాకుళంలో 249.18 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల సగటు వర్షపాతం 95 మి.మీ.గా ఉంటుందని అంచనా వేశారు.

### చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లన్నీ వెంటనే తీరానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సామగ్రితో బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని రిజర్వాయర్లలోకి మళ్లించి, నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటున్నందున ఎవరూ వేటకు వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్ ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార

ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, బస్సు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు. ఈ కొత్త పాస్‌లు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. తరచూ బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

# రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారింది

సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, కుంభకోణాలపై స్పందించకుండా మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ 'ఛాత్రోంకీ గూంజ్' వంటి కార్యక్రమాల గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మైనారిటీల సంక్షేమం కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, అందులో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మైనారిటీ సంక్షేమానికి రూ.4,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది? అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఆసరా పెన్షన్‌ను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని ఎందుకు నెరవేర్చడం లేదు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. రైతులకు ఎకరానికి రూ.10,000కు బదులుగా రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆ హామీని కూడా అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తే సమాధానం చెప్పాల్సిన రేవంత్ రెడ్డి తిట్లతో బదులిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల హక్కు కూడా అని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఒక్కొక్కటిగా వివాదాలు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ పెద్దల కుటుంబ సభ్యులకు సంబంధించిన భూముల వ్యవహారాలు, వ్యాపార ఒప్పందాలపై పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు హైదరాబాద్‌లో కరెంటు కోతలు, నీటి కొరత ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టేవి అని అన్నారు. ప్రతి ఇంట్లో ఇన్వర్టర్లు, ప్రతి అపార్ట్‌మెంట్‌లో జనరేటర్లు తప్పనిసరిగా ఉండే పరిస్థితులు ఉండేవి అని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్, తాగునీరు సహా మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిందని తెలిపారు. హైదరాబాద్ నగరం గంగా-యమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలిచేలా మత సామరస్యాన్ని కాపాడటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని చెప్పారు. హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును గుర్తించి గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారని తెలిపారు. అయితే జిల్లాల్లోని అమాయక రైతులకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. రాబోయే ఏడాదిన్నర కాలంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# ప్రధానిపై మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

"ప్రధాని మోదీపై, ఆయన తండ్రిపై దూషణలకు దిగుతూ కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు హుందాతనాన్ని కోల్పోతోంది. వరుస ఓటములతో నిరాశ, నిస్పృహల్లో ఉన్న కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోంది" అని విమర్శించారు. గతంలో మోదీ తల్లిని, ఆయన పేదరికాన్ని అవమానించారని గుర్తుచేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా కూడా ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. "ప్రధాని మోదీకి దేశవిదేశాల్లో పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నేతలు ద్వేషపూరిత రాజకీయాలు చేస్తున్నారు. 140 కోట్ల మంది ప్రజలు ఎన్నుకున్న ప్రధానిని, ఆయన కుటుంబాన్ని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమే" అని అన్నారు. బీజేపీ నేతలు తుహిన్ సిన్హా, గిరిరాజ్ సింగ్, నితిన్ నబిన్ తదితరులు కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై చర్చించే అంశాలు లేనప్పుడే ప్రతిపక్షాలు ఇలా వ్యక్తిగత దాడులకు దిగుతాయని, ప్రజలు దీనిని గమనిస్తున్నారని, తగిన సమయంలో సమాధానం చెబుతారని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

## ధర్మపురి అభివృద్ధిపై
# మంత్రిపొన్నం ప్రభాకర్ హామీ

వరకు ఉన్న పుణ్యక్షేత్రాల వద్ద ప్రయాణికుల ప్రాంగణాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ధర్మపురి బస్టాండ్ ఆధునీకరణకు శంకుస్థాపన చేసినట్టుగా తెలిపారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి మేరకు డిపో కోసం స్థల సేకరణ చేయాలని సూచించామని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రితో మాట్లాడి అధికారిక అనుమతులు పొంది డిపోను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ప్రజల గుండె చప్పుడు లాంటిది, మూసివేసే స్థితి నుంచి సంస్థను బయటకు తెచ్చి కొత్త బస్సులు కొనడం, నూతన నియామకాలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కారుణ్య నియామకాలు, పీఆర్సీ, బాండ్లు తదితర పెండింగ్ చెల్లింపులు పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్ శివార్లలో ఔటర్ రింగ్ రోడ్ పక్కన నాలుగు వైపులా పెద్ద ఆర్టీసీ టెర్మినల్స్ నిర్మించడానికి ప్రభుత్వం వందల ఎకరాల విలువైన స్థలాలను కేటాయిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలాగా పార్టీ వ్యక్తులకు ఆర్టీసీ స్థలాలను లీజులకు ఇవ్వడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ స్థలాల్లో పేద ప్రజలు ఇళ్లు కట్టిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. ఆర్టీసీ పేదలది ఇళ్ల మంజూరు కోసం ఆర్టీసీ ఉద్యోగులు కూడా అప్లై చేసుకోవచ్చు అర్హత ఉంటే వస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే ప్రజా పాలన ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్, సాగునీటి ప్రాజెక్టులు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో మెస్ ఛార్జీల పెంపు వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వర్షాలు తగ్గడానికి ఎల్‌నినో వాతావరణ ప్రభావమే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారని అన్నారు. దీనిని కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం వారి లోకజ్ఞాన లోపానికి నిదర్శనమని విమర్శించారు. ప్రకృతి విపత్తులు, ప్రజల కష్టాలపై రాక్షసానందం పొందకుండా ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా ఉండాలని చెప్పారు. ఎల్‌నినో సమస్యపై కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లి సహాయం కోరేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

# ఏడుపాయల ఆలయంలో తప్పిపోయిన బాలిక.. తల్లిదండ్రులకు అప్పగింత



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ప్రాంగణంలో తప్పిపోయిన మూడేళ్ల బాలికను విధుల్లో ఉన్న సిబ్బంది గుర్తించి, క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న స్వరూప రాణి, భవాని అనే సిబ్బందికి సుధీక్షిత (3) అనే బాలిక ఏడుస్తూ కనిపించింది. వెంటనే స్పందించిన వారు చిన్నారిని ఓదార్చి, ఆమె వివరాలను సేకరించారు. బాలిక తల్లిదండ్రులు ప్రవీణ్ కుమార్, రేణుకగా గుర్తించారు. వారు మెదక్ జిల్లా, మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామానికి చెందినవారు. సిబ్బంది చొరవతో తల్లిదండ్రులను గుర్తించి బాలికను వారికి క్షేమంగా అప్పగించారు. తమ బిడ్డను సురక్షితంగా అప్పగించిన సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాలు, జాతరలు, ఇతర రద్దీ ప్రాంతాలకు పిల్లలతో వచ్చినప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు.

# ఎస్ ఐ ఆర్ కు వ్యతిరేకంగా మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

**- ముఖ్య అతిథులుగా ఏఐసీసీ పరిశీకులు సరల్ పటేల్**



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్)** నేడు మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కార్యాలయంలో ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ పరిశీలకులు సరల్ పటేల్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏఐసీసీ ముఖ్య అతిథులు మాట్లాడుతూ దేశంలో పెద్ద ఎత్తున ఓటు చోరీకి ఎన్నికల కమిషన్ పాల్పడుతుందని ఓటు బచావో దేశ్ బచావో అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీపోరాటంచేస్తుందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నేపథ్యంలో ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా కాంగ్రెస్ పార్టీ అప్రమత్తంగా ఉండాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని రామ్లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుమారు 15 లక్షల మంది ఓటర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'ఓటు బచావో.. దేశ్ బచావో' నినాదంతో నవంబర్ 1న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొనాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో ముందుకు సాగి, ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, అని మండల అధ్యక్షులు, కౌన్సిలర్స్,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పరశురామ్, జిల్లా మండల కార్యవర్గ సభ్యులు,ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొనారు.

# సంజీవరెడ్డి ప్రథమ వర్ధంతిలో పాల్గొన్న పద్మాదేవేందర్ రెడ్డి.

**- జంగరాయిలో బీఆర్ఎస్ నాయకుడికి ఘన నివాళులు.**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) శంకరంపేట్ మండలం జంగరాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సంజీవరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం సంజీవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పట్లూరి. రాజు, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి,మాజీ సర్పంచ్ లు పులపల్లి.యాదగిరి యాదవ్ రవీందర్ రెడ్డి అయ్యేరి.లక్ష్మణ్ బందేల.ప్రభాకర్ రమేశ్ నాయక్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి జాన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,మొతిరం, పోతరాజు.రాజు,శీను,చందర్ స్వామీ,బస్సీ నాయక్,సురేష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీకమాసానికి శ్రీశైలంలో ఆధ్యాత్మిక సందడి

- పౌర్ణమి వేళ గిరిప్రదక్షిణ,
- అమ్మవారికి లక్షకుంకుమార్చన
- భక్తులకు ఊయలసేవతో దివ్యానుభూతి
- దర్శనాలు, ప్రసాదాలపై ప్రత్యేక దృష్టి
- నవంబరు దర్శన, ఆర్జితసేవా టికెట్లు విడుదల..





**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** పరమశివుడు కొలువైన శ్రీశైల క్షేత్రం పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివార్ల సన్నిధిలో గిరిప్రదక్షిణ, లక్షకుంకుమార్చన, ఊయలసేవల నిర్వహణకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. మరోవైపు సమీపిస్తున్న కార్తీకమాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనాలు, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితోపాటు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

**పౌర్ణమి వేళ గిరిప్రదక్షిణ..** పౌర్ణమి ఘడియలను పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలో సంప్రదాయబద్ధంగా గిరిప్రదక్షిణ నిర్వహించనున్నారు. స్వామి, అమ్మవార్ల మహామంగళహారతి అనంతరం ఆలయ మహాద్వారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం, అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారికి చేరుకుంటుంది. అక్కడి నుంచి సారంగధర మఠం, హేమారెడ్డి మల్లమ్మ మందిరం, మహిషాసురమర్దిని ఆలయం, రుద్రాక్ష మఠం, విభూతి మఠాల మీదుగా రుద్రవనానికి చేరుకుని, తిరిగి నందిమండపం వద్ద ముగుస్తుంది.

ఈ ప్రదక్షిణ ద్వారా శ్రీశైల క్షేత్రంలోని ప్రాచీన ఆలయాలు, మఠాలను దర్శించుకునే అవకాశం భక్తులకు లభిస్తుంది. క్షేత్ర మహాత్మ్యాన్ని తెలుసుకుంటూ, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు అనంతరం స్వామివారి దర్శనం కల్పించనున్నారు.

**లోకకల్యాణం కోసం లక్షకుంకుమార్చన..** పౌర్ణమి సందర్భంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీ భ్రమరాంబికా అమ్మవారికి లక్షకుంకుమార్చన నిర్వహించనున్నారు. ముందుగా పూజా సంకల్పం, మహాగణపతి పూజ అనంతరం అమ్మవారికి కుంకుమార్చన జరిపిస్తారు. మంగళప్రదమైన కుంకుమతో అమ్మవారిని అర్చించడం విశేష ఫలదాయకమని పండితులు పేర్కొంటారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తూ లోకశాంతి, సౌభాగ్యం, సకల శుభాలు కలగాలని ప్రార్థించే ఈ సేవకు విశేష ప్రాధాన్యం ఉంది. భక్తులు ప్రత్యక్షంగా హాజరుకాలేని పక్షంలో పరోక్షసేవలో పాల్గొనే సదుపాయాన్ని దేవస్థానం కల్పించింది. ఇందుకోసం మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009 లేదా ఏపీఎస్‌టీఎస్ వెబ్‌సైట్ ఝఝ్.ఎం.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా రూ.1,116 సేవా రుసుము చెల్లించి పాల్గొనవచ్చు.

**పుష్పాలంకరణల నడుమ ఊయలసేవ** పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ నిర్వహించనున్నారు. లక్షకుంకుమార్చన అనంతరం లోకకల్యాణ సంకల్పం, మహాగణపతి పూజ జరిపి, ఊయలలో వేంచేపు చేసిన స్వామి, అమ్మవార్లకు షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఊయలసేవను శాస్త్రోక్తంగా జరిపిస్తారు. ఈ సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పుష్పార్చన చేపడతారు. ప్రతి శుక్రవారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజుల్లో నిర్వహించే ఈ సేవ భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించనుంది.

**దర్శన క్యూలైన్లపై ప్రత్యేక నిఘా..** కార్తీకమాసం సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు దర్శన క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ భవనం, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలను పరిశీలించారు. క్యూకాంప్లెక్సుల్లో అవసరమైన ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రద్దీ సమయంలో తొక్కిసలాటకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, క్యూలైన్లలో నిరంతరం మంచినీరు, అల్పాహారం అందించాలని ఆదేశించారు. దర్శన సమయాలు, వేచి ఉండాల్సిన సమయాన్ని ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. అన్నప్రసాద వితరణను కార్తీకమాస భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్వహించాలని, శౌచాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీలో నాణ్యత, పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. భక్తులకు వేగంగా ప్రసాదాలు అందించేందుకు అదనంగా మూడు లడ్డూ కౌంటర్లు, మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**నవంబరు దర్శన టికెట్లు విడుదల..** నవంబరు నెలకు సంబంధించిన స్వామివారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం, వివిధ ఆర్జితసేవల టికెట్లను దేవస్థానం విడుదల చేసింది. భక్తుల సౌకర్యార్థం 80 శాతం టికెట్లను రాష్ట్ర ప్రభుత్వ మనమిత్ర వాట్సాప్ ద్వారా, మిగిలిన 20 శాతం టికెట్లను ఝఝ్.ఎం.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా పొందే అవకాశం కల్పించారు. గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతిహోమం, రుద్రహోమం, మహామృత్యుంజయ హోమం, చండీహోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం తదితర ఆర్జితసేవలకు టికెట్లు అందుబాటులో ఉన్నాయి. టికెట్ పొందిన భక్తులు దాని ముద్రిత ప్రతితోపాటు ఆధార్ గుర్తింపు పత్రాన్ని తీసుకురావాల్సి ఉంటుంది. టికెట్ల లభ్యతను బట్టి ఆర్జితసేవలకు గంట ముందువరకు కూడా టికెట్లు పొందే అవకాశం కల్పించినట్లు దేవస్థానం తెలిపింది.

**కార్తీకమాసంలో కొన్ని సేవలు నిలిపివేత** నవంబరు 10 నుంచి డిసెంబరు 9 వరకు కార్తీకమాసం సందర్భంగా గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకాలు, ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాల సేవలను నిలిపివేయనున్నారు. ఆర్జిత హోమాలు, కల్యాణోత్సవం తదితర సేవలు యథావిధిగా కొనసాగుతాయి. రద్దీ రోజుల్లో అమ్మవారి అంతరాలయంలో జరిగే రూ.1,000 కుంకుమార్చనను ఆశీర్వచన మండపంలో నిర్వహించుకునే అవకాశం కల్పించనున్నారు. పౌర్ణమి పూజలు, గిరిప్రదక్షిణతో ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుకుంటున్న శ్రీశైల క్షేత్రం.. కార్తీకమాసంలోనూ భక్తుల రాకతో మరింత కళకళలాడనుంది. భక్తిభావం, సంప్రదాయం, సేవా సౌకర్యాలు సమన్వయమైతేనే యాత్ర సార్థకమవుతుందనే లక్ష్యంతో దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది.

# యూపీలో 'వికాస్ యాదవ్' పేరుతో 10 మంది ఓటర్లు..

## 9 మంది అధికారులపై చర్యలు



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఒకే వ్యక్తి పేరుతో పది మంది ఓటర్లు ఉన్నారు. 'వికాస్ యాదవ్' పేరుతో తప్పుగా పది మంది ఓటర్లను నమోదు చేసినట్లు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో తొమ్మిది మంది ఎన్నికల అధికారులు, సిబ్బందిపై చర్యలు చేపట్టారు. అజంగఢ్ జిల్లాలో 'వికాస్ యాదవ్' పేరుతో 10 మంది ఓటర్లను తప్పుగా నమోదు చేసినట్లు ఎస్పీ ఆరోపించింది. ఒక ప్రెస్ మీట్‌లో ఆ వ్యక్తిని ప్రవేశపెట్టింది. దీనిపై విచారణ జరుపాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది.కాగా, ఉత్తరప్రదేశ్ ఎన్నికల కమిషన్ ఈ ఫిర్యాదుపై స్పందించింది. అజంగఢ్ జిల్లా ఎన్నికల అధికారి నుంచి నివేదిక కోరింది. ఒక వ్యక్తి పేరు మాత్రమే వికాస్ యాదవ్ కాగా, మిగిలిన 10 మందిని అదే పేరుతో తప్పుడు ఓటర్లుగా నమోదు చేసినట్లు బయటపడింది. ఓటర్ల జాబితాల నిర్వహణలో సహాయపడే ఒక కంప్యూటర్ సహాయకుడు, ఐదుగురు బూత్ స్థాయి అధికారులు ఈ పొరపాటుకు బాధ్యులని తేలింది. దీంతో వారిని వెంటనే ఓటర్ల జాబితా విధుల నుంచి తొలగించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 32 కింద చట్టపరమైన చర్యలకు కూడా ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు పిలిభిత్‌లో కూడా ఓటర్ల వివరాలలో 10,000కు పైగా అనధికారిక మార్పులు జరిగినట్లు ఎస్పీ ఆరోపించింది. యూపీ ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా స్పందించారు. రాష్ట్రవ్యాప్త విచారణకు ఆదేశించారు. అజంగఢ్‌లోని ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఓటర్ల జాబితాలను తనిఖీ చేసి, వారంలోగా నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారిని కోరడంతో ఓటర్ల జాబితాలకు సంబంధించిన అనేక పొరపాట్లు వెలుగులోకి వచ్చాయి.

# ఇంట్లో నాఫ్తలీన్ బాల్స్ వాడుతున్నారా..?

## అయితే ఈ ప్రమాదాల గురించి తెలుసుకోవాల్సిందే..!

చలికాలం లో బీరువాల్లో దుస్తులను భద్రపరిచేటప్పుడు నాఫ్తలీన్ బాల్స్ వేయడం చాలా ఇళ్లలో సాధారణమే. అల్మారాల్లోని దుస్తుల్లోకి బొద్దింకలు చేరకుండా, సువాసన కోసం వీటిని ఉపయోగిస్తుంటారు. కొందరు బాత్‌రూమ్‌లు , టాయిలెట్ లలోనూ ఈ నాఫ్తలీన్ బాల్స్ వేస్తుంటారు. అయితే వీటిలో ఉండే నాఫ్తలీన్ ఓ రసాయన పురుగుమందు. దీని వాసనను ఎక్కువసేపు పీల్చడం, పొరపాటున మింగడం, చర్మానికి ఎక్కువగా తగలడం ఆరోగ్యానికి హాని కలిగించవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.నాఫ్తలీన్ బాల్ కరగకపోయినా వాసన వస్తుంది. గది ఉష్ణోగ్రత వద్దే దాని అణువులు నెమ్మదిగా గాల్లోకి చేరుతాయి. దీన్నే 'సబ్లిమేషన్' అంటారు. అందుకే అల్మారా తెరిచిన వెంటనే ఘాటైన వాసన వస్తుంది. మూసి ఉన్న అల్మారాల్లో గాలి ప్రసరణ తక్కువగా ఉంటే ఆవిర్లు పేరుకుపోయే అవకాశం ఉంటుంది. అల్మారా తలుపులు తెరిచి గాలి ప్రసరించేలా చేయడంవల్ల ఆవిరి కొంత తగ్గి ఘాటు వాసన తగ్గుతుంది.నాఫ్తలీన్ బాల్స్ వాసనను తరచూ పీల్చడం సురక్షితం కాదు. తలనొప్పి, వికారం, తల తిరగడం, కళ్లకు-ముక్కుకు మంట, నీరసం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ స్మెల్ ఎక్కువ మోతాదులో శరీరంలోకి వెళ్తే ఎర్ర రక్తకణాలు దెబ్బతిని రక్తహీనతకు దారితీయవచ్చు. కాలేయం, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.పిల్లల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. బాల్స్ చిన్న పరిమాణంలో ఉండటం, పిల్లలకు వస్తువులను నోట్లో పెట్టుకునే అలవాటు ఉండటం కారణంగా ప్రమాదం పెరుగుతుంది. నాఫ్తలీన్ బాల్‌ను పొరపాటున మింగితే తీవ్ర విష ప్రభావం కలగవచ్చు. అందుకే పిల్లలు ఉండే గదుల్లో, వారు నిద్రించే ప్రదేశాల్లో వీటిని వాడకపోవడం మంచిది. ఆహార పదార్థాలు పెట్టే డబ్బాల్లో వీటిని నిల్వ చేయకూడదు.ఈ నాప్తాలిన్ బాల్స్ పెంపుడు జంతువులకు కూడా ప్రమాదకరమే. కుక్కలు, పిల్లులు నాఫ్తలీన్ బాల్స్‌ను కొరికినా, మింగినా తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. వాంతులు, కడుపు నొప్పి, నీరసం, రక్తహీనత, నాడీ సంబంధ సమస్యలు, అవయవాల దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. నేలపై వీటిని వదిలేయడం మరింత ప్రమాదకరం.

సాధారణంగా బాత్‌రూమ్‌లు, టాయిలెట్లలో దుర్వాసన పోగొట్టేందుకు లేదా పురుగులను తరిమేందుకు నాఫ్తలీన్ బాల్స్ పెడుతుంటారు. అయితే వాటిని అలా వాడకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గాలి ప్రసరణ సరిగా లేని ప్రదేశాల్లో ఆవిర్లకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది. దాంతో ఘాటైన వాసన వస్తుంది. నిత్యం ఆ వాసన పీల్చుకోవడం ఆరోగ్యానికి హాని చేస్తుంది.నాఫ్తలీన్ బాల్స్‌కు బదులుగా దుస్తులను శుభ్రంగా, పూర్తిగా ఆరబెట్టి భద్రపరచడం మంచి పద్ధతి. గాలి చొరబడని కంటైనర్లు లేదా గార్మెంట్ బ్యాగుల్లో వీటిని ఉంచాలి. అల్మారాలను పొడిగా, అస్తవ్యస్తంగా



లేకుండా చూసుకోవాలి. ఎక్కువకాలం నిల్వచేసిన దుస్తులను మధ్య మధ్యలో బయటకు తీసి గాలి తగిలించాలి. దుస్తులను ఉతకడంవల్ల కొంత రసాయన అవశేషం తొలగవచ్చు.కానీ పూర్తిగా పోతుందని చెప్పలేం. దుస్తులకే కాకుండా అల్మారా, స్టోరేజ్ బాక్సుల్లోనూ ఆవిర్లు లేదా అవశేషాలు ఉండొచ్చు. అందుకే దుస్తులను ఉతకడంతోపాటు వాటిని బాగా గాలి తగిలేలా చేయాలి. అల్మారా, నిల్వ ప్రదేశాన్ని కూడా శుభ్రం చేసి గాలి ప్రసరించేలా చేసిన తర్వాతే మళ్లీ ఉపయోగించడం మంచిది.

# లగ్జరీ కారు నడిపిన జడ్జి మైనర్ కుమారుడు..

# స్కూటీని ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



తిరువనంతపురం: ఒక న్యాయమూర్తికి చెందిన మైనర్ కుమారుడు లగ్జరీ కారు నడిపాడు. ఒక స్కూటీని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి మరణించాడు. ఈ నేపథ్యంలో జడ్జి కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళంలోని కొచ్చిలో ఈ సంఘటన జరిగింది. (యబసస్త్రవ'ం వీఅఅశీతీ ంశీఅ నతీఅజవం ఝతీ ష్ట్రఱం ంఎశీశీవతీ) ఒక న్యాయమూర్తికి చెందిన 17 ఏళ్ల కుమారుడు మెర్సిడెస్ కారు నడిపాడు. ఆదివారం తెల్లవారుజామున ఒక స్కూటర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. స్కూటీ నడుపుతున్న వ్యక్తి మరణించాడు.కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడిని 55 ఏళ్ల జయబాలకృష్ణన్‌గా గుర్తించారు. కారు నడిపిన జడ్జి కుమారుడైన 17 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద సమయంలో నిందితుడు మద్యం సేవించి లేడని పోలీస్ అధికారి తెలిపారు. అయితే మరింత నిర్ధారణ కోసం అతడి రక్త నమూనాలను సేకరించినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వివరించారు. మరోవైపు ఈ ప్రమాదం తర్వాత ఆ న్యాయమూర్తి తమతో చాలా అగౌరవంగా మాట్లాడినట్లు మృతుడి బంధువైన మహిళ ఆరోపించారు. మైనర్ బాలుడు కారు నడపడానికి ఎలా అనుమతించారని ఆమె ప్రశ్నించారు. 'ఈ కేసును మేం ముందుకు తీసుకువెళ్తాం. ఆ న్యాయమూర్తి వ్యవహరించిన తీరును పరిగణనలోకి తీసుకుంటే ఇది అవసరం. అంతేకాకుండా, లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదనే విషయం అందరికీ ఒక పాఠం కావాలి' అని మీడియాతో ఆమె అన్నారు.

# ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు సంబంధం లేదు..

## ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ వెల్లడి



నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ర్యాలీతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎంఐఎం పార్టీ చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై అసదుద్దీన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై స్పందించారు. ఇండియా బ్లాక్ ర్యాలీతో మాకు ఎలాంటి సంబందం లేదు. నేను సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నా. అందుకోసమే కోర్టులో కేసు వేశా. సర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై ని నియమించడం దగ్గరి నుంచి సీఈసీకి చట్టపరమైన రక్షణ కల్పించడానికి కూడా నేను వ్యతిరేకం. అయితే, దీనికోసమే ఇండియా బ్లాక్ కూటమి చేపడుతున్న ర్యాలీతో మాకు ఎలాంటి సంబంధం లేదు అన్నారు. ఇదే సమయంలో ప్రస్తుతం జేఎన్‌యూలో జరుగుతున్న కాశ్మీర్ ఫ్రీ గ్రాఫిటీ అంశంపై కూడా అసదుద్దీన్ మాట్లాడారు. కాశ్మీర్‌ను వేరు చేయాలంటూ యూనివర్సిటీలో రూపొందిన గ్రాఫిటీకి ఎవరు బాధ్యులు..? యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్. ఆ ఇద్దరూ ఆర్ఎస్ఎస్ ముస్లిం రాష్ట్ర మోర్చా సభ్యులే. వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి. జేఎన్‌యూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలో న్యాయం ఉంది.ఈ విషయాన్ని విస్మరించడానికి వీల్లేదు. షర్జీల్ ఇమామ్ సిద్ధాంతాలపై మీకు వ్యతిరేకత ఉండొచ్చు. అది మీకు నచ్చకపోవచ్చు. అంతమాత్రాన అతడికి అదే అంశంపై న్యాయం జరగకుండా అడ్డుకోవడం సరికాదు. న్యాయం చేయడం అనేది కోర్టుల పని. ఆ కేసు విచారణ కొనసాగనివ్వండి. కనీసం అది కూడా జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు అంటూ అసదుద్దీన వ్యాఖ్యానించారు. ఇక.. నవంబర్ 1న ఢిల్లీ, రాంలీలా మైదానంలో ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో ర్యాలీ జరగనుంది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర కూటమి పార్టీల నేతలు ఇందులో పాల్గొననున్నారు.

# బీఆర్ఎస్‌లోకి ఖైరతాబాద్ యువ నాయకుడు జిబ్రాన్ షరీఫ్



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఖైరతాబాద్ యువ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిబ్రాన్ షరీఫ్‌కు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, కార్తకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ, విద్యారంగ సమస్యలపై పోరాడిన చరిత్ర రాకేష్ రెడ్డిది..

## ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు



కోదాడ : జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మొండిచేయి చూపిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పైడిమర్రి సత్యబాబు విమర్శించారు.ఆదివారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కోమరబండలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై అవగాహన కల్పిస్తూ పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి గెలిపించాలని పట్టభద్రులను కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎంపిక చేసిన ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. నిరుద్యోగ, విద్యారంగ సమస్యలపై పోరాడిన చరిత్ర రాకేష్ రెడ్డికి ఉందన్నారు. శాసనమండలిలో తన వాణిని వినిపించి విద్యార్థి యువత సమస్యలు పరిష్కరించే సత్తా ఆయనకు ఉందన్నారు. వాస్తవాలను గమనంలోకి తీసుకొని పార్టీలకతీతంగా యువత, విద్యావంతుడు రాకేష్ రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ చీమ నరేష్ ఉపేందర్ గౌడ్, కరీముల్లా, అలవాల వెంకట్ ,బత్తుల ఉపేందర్ ,సాధిక్ , చలిగంటి వెంకట్, అబ్బు శ్రీకాంత్, రాజు నాగుల్, రాజేష్, రమేష్ సైదులు, నరసయ్య, సిద్దు, వీరబాబు, శంబయ్య, శ్రీను, సుధాకర్, వెంకన్న పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# కొల్లూర్ ఓఆర్ఆర్ పైన ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి



రామచంద్రపురం, అక్టోబర్25 : సంగారెడ్డి జిల్లా కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా కొల్లూర్ అవుటర్ రింగ్ రోడ్ పైన డివైడర్ మధ్యలో ఉన్న చెట్లకు నీళ్లు పోస్తున్న వాటర్ టాంకర్‌ను అతి వేగంగా వచ్చి అశోక్ లేలాండ్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ లేల్యాండ్ వాహనంలోని డ్రైవర్ శ్రీనాథ్ (25) క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలై మృతి చెందాగా చెట్లకు నీళ్ళు పడుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది శ్రీనివాస్ (30)అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పఠాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కరువుపై ప్రకటనలేనా.. సహాయక చర్యలేవీ?

## - గుమ్మడి నర్సయ్య



ఊట్కూర్ : వర్షాభావంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు సహాయక చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విమర్శించారు. కరువు పరిస్థితులు ముందుగానే స్పష్టమైనప్పటికీ ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆదివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్‌లోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వర్షాభావంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, పశుగ్రాసం, తాగునీటి కొరతతో ప్రజలు, పశువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరువు తీవ్రతను అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నరసయ్య డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్ల పెంపు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, సంపూర్ణ రైతు రుణమాఫీ హామీల అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. రుణభారంతో సతమతమవుతున్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం డిసెంబర్ 29, 2026న హైదరాబాద్‌లో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని నర్సయ్య ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఈ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారన్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేయడంతోపాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ సమావేశంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాము, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ఎం.కృష్ణ, ఎం.హన్మేష్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయకపోతే ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి సలీమ్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్.కిరణ్, మండల కార్యదర్శి సిద్ధు, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు మల్లేష్, జి.కృష్ణయ్య, పోర్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# కన్నడ యువతకు ఉద్యోగాలివ్వకపోతే చర్యలు కఠినంగుంటాయ్

## - డీకే శివకుమార్



కర్ణాటక కేంద్రంగా పనిచేసే ప్రైవేటు సంస్థలు ముఖ్యంగా ఐటీ కంపెనీల యాజమాన్యాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నియామక ప్రక్రియలో కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నట్లు తేలితే ఆయా సంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికుల హక్కులు, గౌరవం, ఉద్యోగ అవకాశాలను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని అన్నారు. బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయని, వీటిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని డీకే ఎక్స్‌లో పోస్టు చేశారు. కన్నడ ప్రజల హక్కులు, గౌరవానికి ఇబ్బంది కలిగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అనుమతించబోదని చెప్పారు. కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యాలు, సామర్థ్యాలను చూసి రాష్ట్రం గర్విస్తోందని అన్నారు. ఏదైనా ప్రైవేటు సంస్థ వారిని ఉద్దేశపూర్వకంగా పక్కనపెడితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.కన్నడిగులకు ఉద్యోగాల అంశంపై సోషల్ మీడియాలో ఇటీవల వీడియోలు వైరల్ అయ్యాయి. తాజాగా రెజ్యూమెలో భాష స్థానంలో కన్నడ అని ప్రస్తావించినందుకు తన దరఖాస్తును తిరస్కరించారని చెబుతూ ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూడా ట్యాగ్ చేశారు. ఇదే తరహా ఫిర్యాదులు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీఎం తీవ్రస్థాయిలో స్పందించారు.

# పలాసపై కూటమి గురి

**1, 2 వార్డుల్లో జనసేన అభ్యర్థులను గెలిపించండి**

**మొగిలిపాడు ప్రచార సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పిలుపు**

**చైర్‌పర్సన్ అభ్యర్థి వజ్జ గంగాభవానికి మద్దతివ్వాలని విజ్ఞప్తి**





పలాస-కాశీబుగ్గ(ప్రశ్న న్యూస్) పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీపై కూటమి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మొగిలిపాడులో నిర్వహించిన ప్రచార సభలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 1, 2 వార్డుల్లో జనసేన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పలాస-కాశీబుగ్గను రాష్ట్రంలోని టాప్-10 మున్సిపాలిటీల్లో నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

### అభివృద్ధే ప్రధాన అజెండా..

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, స్థానిక సమస్యలకు పరిష్కారం చూపుతూ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### ఫ్లైఓవర్.. కేంద్రీయ విద్యాలయం..

పలాస ప్రాంత అభివృద్ధికి సంబంధించిన రైల్వే ఫ్లైఓవర్, కేంద్రీయ విద్యాలయం, ఇంటింటికీ తాగునీటి సరఫరా అంశాలను కేంద్రమంత్రి ప్రస్తావించారు. రవాణా సదుపాయాలు, నాణ్యమైన విద్య, తాగునీటి వసతి పట్టణ ప్రగతికి కీలకమని వివరించారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ పలాస--కాశీబుగ్గను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

### కూటమి అభ్యర్థులకు అండగా నిలవండి

మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి వజ్జ గంగాభవానితో పాటు కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రజలు మద్దతివ్వాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ముఖ్యంగా 1, 2 వార్డుల్లో జనసేన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
మొత్తంగా మొగిలిపాడు సభతో పలాస--కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు మరింత దూకుడు పెంచారు. పట్టణ అభివృద్ధి లక్ష్యాలు, స్థానిక మౌలిక సదుపాయాల కల్పన అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు.

# భవానీలతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి..

**- రద్దీతో ప్రత్యేక దర్శనాలు రద్దు, అందరికీ ఉచిత సర్వదర్శనం**

**- 'జై భవానీ' నామస్మరణతో మార్మోగిన కనకదుర్గమ్మ సన్నిధి**







విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ సన్నిధి భవానీ భక్తులతో కిటకిటలాడింది. భవానీ దీక్షల విరమణ కోసం ఆదివారం తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎర్రని వస్త్రాలు ధరించిన దీక్షాధారుల రాకతో కొండపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల జయజయధ్వానాలు, 'జై భవానీ' నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగింది.

### రద్దీతో దర్శనాలపై కీలక నిర్ణయాలు..

భవానీ భక్తులతో పాటు సాధారణ భక్తుల రాక పెరగడంతో ఘాట్ రోడ్డు, కనకదుర్గ నగర్ వైపు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో కొండపైకి చేరుకున్నారు. దీంతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకున్న దేవస్థానం అధికారులు దర్శన ఏర్పాట్లలో మార్పులు చేశారు. సామాన్య భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించే ఉద్దేశంతో ఉదయం నుంచే అంతరాలయ దర్శనాలను రద్దు చేశారు.మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన సమర్పించిన అనంతరం అన్ని రకాల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను కూడా రద్దు చేశారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులందరికీ ఉచిత సర్వదర్శనం ద్వారా అమ్మవారి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. రద్దీని క్రమబద్ధీకరించి భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పించడంపై దేవస్థాన యంత్రాంగం దృష్టి సారించింది.

### క్యూలైన్లలో తాగునీటి సరఫరా..

దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. క్యూలైన్లలో నిరంతరాయంగా తాగునీరు పంపిణీ చేసే ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు సంయమనం పాటిస్తూ దేవస్థాన, భద్రతా సిబ్బందికి సహకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ విజ్ఞప్తి చేశారు.

### అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి..

### కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు..

మరోవైపు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. హరిహరనాథ్ శర్మ ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు న్యాయమూర్తి, ఆయన కుటుంబ సభ్యులకు వేదోక్తంగా ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరఫున అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాన్ని అధికారులు అందించారు.

## కానిస్టేబుల్ చెవిని కొరికిన ర్యాపిడో డ్రైవర్..

సాధారణంగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నపుడు ఎవరైనా వారికి దొరికితే కొందరు టెన్షన్‌లో ఎలాగైనా తప్పించుకోవాలనే క్రమంలో ఏం చేస్తారో కూడా అంచనాల వేయలేం.. కొన్నిసార్లు పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడినవాళ్లు కూడా ఉన్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్-చంద్రాయణగుట్ట సమీపంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ ర్యాపిడో డ్రైవర్ అజీజ్ పోలీసులకు దొరికాడు. అయితే ఈ క్రమంలో సదరు ర్యాపిడో డ్రైవర్ అజీజ్ ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కొరికాడు. అనంతరం రోడ్డుపై హంగామా చేశాడు. పోలీసులు అజీజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### ఏపీ, ఒడిశాకు పొంచివున్న తీవ్ర తుపాను ముప్పు..

## అప్రమత్తమైన ప్రభుత్వాలు..!

ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు తీవ్ర తుపాను ముప్పు పొంచివున్నదని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి అతి తీవ్ర తుపానుగా మారి తీరంవైపు దూసుకొస్తోందని, ఈ తుపాను అక్టోబర్ 28న బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని వెల్లడించింది. కాబట్టి అప్రమత్తంగా ఉండాలని ఏపీకి హెచ్చరిక జారీచేసింది.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీచేశారు. ఒడిశా సర్కారు కూడా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నది. తీరం వెంబడి విపత్తు నిర్వహణ సిబ్బందిని భారీగా మోహరించింది. తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నది.కాగా ఐఎండీ ఆదివారం ఉదయం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 880 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 980 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నది. ఇది క్రమంగా బలపడుతూ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నది. ఈ సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా, అక్టోబర్ 26న తుపానుగా, 27న తీవ్ర తుపానుగా, 28 నాటికి అతి తీవ్ర తుపానుగా మారనుంది.అక్టోబర్ 28న ఉదయం తుపాను తీరాన్ని తాకే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తుపాను సన్నద్ధతపై సీఎం చంద్రబాబు.. సీఎస్ సాయి ప్రసాద్‌తో, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అధికార యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. అత్యవసర సాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

## తమిళనాడులో భారీ వర్షాలు..

## పలు పర్యాటక ప్రాంతాలు మూసివేత

తమిళనాడులో కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. వర్షాల కారణంగా ఊటీ, కొడైకెనాల్ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. రహదారులు దెబ్బతిని, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఊటీ, కొడైకెనాల్ వంటి పర్యాటక ప్రాంతాలను మూసివేసి వేశారు. పర్యాటకులు రావొద్దని అధికారులు సూచించారు. సముద్రంలో అలజడి కారణంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. కాగా, కళ్లకుర్చిలో అత్యధికంగా 17 సెం.మీ. వర్షం కురిసింది. పెరంబలూరులో 15 సె.మీ. ధర్మపురిలో 14 సెం.మీ. వర్షం కురిసింది. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

## కృష్ణానదిలో మునిగిన నాటుపడవ..

## ఇద్దరు యువకులు దుర్మరణం..!



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తాడేపల్లి మండలం ప్రాతూరు వద్ద కృష్ణా నదిలో నాటుపడవ మునిగిన ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మృతులను అర్జున్ (17), హర్ష (18)గా గుర్తించారు. శనివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాతూరు గ్రామానికి చెందిన ఈశ్వర్, సందీప్, సంతోష్, అర్జున్, హర్ష అనే ఐదుగురు స్నేహితులు శనివారం సరదాగా నాటుపడవలో నదీపాయను దాటి వెళ్లారు.తిరిగి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న పడవలోకి నీరు చేరడంతో అది నదిలో మునిగిపోయింది. సందీప్, సంతోష్, ఈశ్వర్ ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరి ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. అర్జున్, హర్ష నదిలో గల్లంతయ్యారు. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు గ్రామస్థుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టి, గల్లంతైన ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు.మృతులలో ఒకరైన హర్ష తాడికొండలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల కోసం స్వగ్రామానికి వచ్చి ఇలా మృత్యువాత పడటం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. హర్ష తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితమే మరణించినట్లు స్థానికులు తెలిపారు. అర్జున్ పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## రానున్న ఐదు రోజులు అప్రమత్తంగా ఉండండి..

## అధికారులకు ఏపీ హోంమంత్రి ఆదేశం..!




ఏపీలో అర్నబ్ తుపాను బీభత్సం సృష్టించే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఏపీ హోంమంత్రి అనిత సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. రానున్న ఐదు రోజులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం నుంచి విస్తారంగా, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం బాపట్ల-విశాఖ తీరాల మధ్య తుపాను తీరం దాటే సూచనలు ఉన్నాయని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని మంత్రి చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని హోంమంత్రి ఆదేశించారు. అవసరమైతే తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బీచ్‌లలోకి పర్యాటకులను అనుమతించవద్దని అన్నారు. భారీ అలలు ఎగసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, వ్యాప్తి చేయవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ జారీచేసే అధికారిక హెచ్చరికలను పాటించాలని మంత్రి అనిత కోరారు.

## ఎన్నికల్లో ఓటరు నమోదే కీలకం

**- ఎర్రబెల్లి దయాకర్ రావు**

వరంగల్ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కీలకమని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. వరంగల్ జిల్లా గీసుగొండలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశానికి ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, సాంబారి సమ్మారావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### బాబాయ్ ఇంట్లో బంగారం దొంగిలించి..

## థార్ కొనుగోలు చేసిన వ్యక్తి

ముంబై: ఒక యువకుడు తన బాబాయ్ ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగిలించాడు. వాటిని అమ్మి థార్ వాహనం కొనుగోలు చేశాడు. వాహనం పూజ కోసం బాబాయ్‌ను కూడా అతడు ఆహ్వానించాడు. బంగారు నగలు మాయంపై ఆయన ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సతావే గ్రామానికి చెందిన 19 ఏళ్ల సమర్ చవాన్, తన ఇంటి సమీపంలో నివసించే బాబాయ్ ఉమేష్ మారుతి చవాన్ ఇంట్లో నెల రోజుల కిందట 15 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించాడు. స్థానిక స్వర్ణకారుడైన సంగ్రామ్ బాబాసో మోరే సహాయంతో రూ.10 లక్షలకు వాటిని అమ్మాడు. ఆ డబ్బుతో కొత్త మహీంద్రా థార్‌ను అతడు కొనుగోలు చేశాడు.కాగా, కొత్త వాహనాన్ని ఇంటికి తెచ్చిన తర్వాత పూజకు రావాలని బాబాయ్ ఉమేష్ చవాన్‌ను సమర్ ఆహ్వానించాడు. ఆ కార్యక్రమం కోసం నగలు ధరించాలని భావించిన ఉమేష్‌కు అవి కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గ్రహించాడు. అయితే ఉమేష్ అమ్మమ్మకు చెందిన నగలు పక్కనే ఉన్నప్పటికీ వాటిని ఎవరూ తాకలేదు. కేవలం ఉమేష్, అతడి భార్యకు చెందిన నగలు మాత్రమే మాయమయ్యాయి. దీంతో కుటుంబానికి చెందిన వ్యక్తే ఆ బంగారు నగలు చోరీ చేసినట్లు ఆయన అనుమానించాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.మరోవైపు పోలీసులు సమర్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఆ యువకుడు అకస్మాత్తుగా కొత్త కారు కొనుగోలు చేయడానికి అవసరమైన డబ్బును ఎలా సమకూర్చాడు అన్న దానిపై దర్యాప్తు చేశారు. కీలక ఆధారాలు లభించడంతో సమర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించారు. తానే దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించడంతో అతడితో పాటు బంగారు వ్యాపారి సంగ్రామ్ మోరేను కూడా అరెస్ట్ చేశారు. ఆ బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## 'లవ్ మక్తల్' బోర్డును

## శుభ్రం చేసిన బీఆర్ఎస్ నాయకులు



నారాయణపేట జిల్లా మక్తల్ పురపాలిక పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 'లవ్ మక్తల్' బోర్డు అపరిశుభ్రంగా మారడంపై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డుపై ఇష్టానుసారంగా వివిధ రకాల పోస్టర్లు అతికించడంతో పాటు, బోర్డు వద్ద మద్యం సీసాలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని వారు పేర్కొన్నారు. పురపాలక అధికారులు, చైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వయంగా రంగంలోకి దిగారు. నీటితో బోర్డుతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో పురపాలికకు సంబంధించిన పలు ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని, అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 'లవ్ మక్తల్' బోర్డును నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పురపాలిక పరిధిలో మరమ్మతులు అవసరమైన ప్రాంతాలను గుర్తించి వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

## హబ్సిగూడలో బీజేపీ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్

# ఓటర్ల నమోదు కార్యక్రమం

-చింతకింది ప్రవీణ్ ఆధ్వర్యంలో భారీగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు

-ఎన్ఎస్ఎల్ అపార్ట్‌మెంట్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్న గ్రాడ్యుయేట్లు



ఉప్పల్(ప్రశ్న న్యూస్)హబ్సిగూడ డివిజన్ బిజెపి అధ్యక్షులు చింతకింది ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. హబ్సిగూడలోని ఎన్ఎస్ఎల్ అపార్ట్‌మెంట్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రాడ్యుయేట్లు ఉత్సాహంగా పాల్గొని, ఓటరు నమోదు కోసం తమ దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ఫారాలు సేకరించారు.గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హత మేరకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గ్రాడ్యుయేట్లకు ఓటరు నమోదు ప్రక్రియపై సహకారం అందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హబ్సిగూడ కన్వీనర్ కట్ట భాస్కర్, జిల్లెల్ల రవీందర్ రెడ్డి, బొమ్మగాని రఘుపతి గౌడ్, బండి పద్మ, అల్కాపూరి సురేష్, పుల్లూరి భాస్కర్, వేములకొండ వెంకన్న గౌడ్, రాజు నాయక్, రమేష్ నాయక్, రాఘవేందర్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, గుండేటి వెంకటేష్, గోల్డ్ శీను, మహేందర్, కో-కన్వీనర్ కొండేరు స్రవంతి, అడపాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కూటమిలో చిచ్చు పెట్టే ప్రచారాన్ని నమ్మొద్దు

మంత్రి నారాయణపై దుష్ప్రచారాన్ని ఖండించిన జనసేన మహిళా అభ్యర్థులు

టీడీపీ శ్రేణుల పూర్తి సహకారం, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం



నెల్లూరు(ప్రశ్న న్యూస్) ఎన్నికల వేళ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మధ్య విభేదాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని జనసేన మహిళా అభ్యర్థులు ఖండించారు. మంత్రి నారాయణపై ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తూ కూటమిలో విభేదాలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. జనసేన అభ్యర్థుల విజయానికి మంత్రి నారాయణతో పాటు టీడీపీ శ్రేణులు పూర్తి సహకారం అందిస్తున్నాయని స్పష్టం చేశారు.జేమ్స్ గార్డెన్‌లోని రూప్‌కుమార్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో 71వ డివిజన్ జనసేన అభ్యర్థి అలియా, 21వ డివిజన్ అభ్యర్థి గునుకుల విజయలక్ష్మి, 15వ డివిజన్ అభ్యర్థి కెజియా కుమారి మాట్లాడారు.

### అభివృద్ధే మా ప్రచార అస్త్రం..

కూటమి పొత్తులో భాగంగా జనసేనకు చెందిన ముగ్గురు మహిళలకు కార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం లభించిందని 71వ డివిజన్ అభ్యర్థి అలియా తెలిపారు. మంత్రి నారాయణ ఆదేశాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ విజయానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జనసేన పోటీ చేస్తున్న డివిజన్లలోనూ మంత్రి అన్ని విధాలా సహకరిస్తున్నారని చెప్పారు. నెల్లూరులో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నామని, ప్రజల నుంచి స్పందన లభిస్తోందని తెలిపారు. పవన్ కల్యాణ్ నాయకత్వంలో, మంత్రి నారాయణ సహకారంతో ప్రచారం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

### ఎక్కడా వ్యతిరేకంగా చెప్పలేదు..

మంత్రి నారాయణ జనసేనకు ఓటు వేయొద్దని ఎక్కడా చెప్పలేదని 21వ డివిజన్ అభ్యర్థి గునుకుల విజయలక్ష్మి స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఎలాంటి విభేదాలు లేవని పేర్కొన్నారు. మంత్రి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తమ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్న అంశాలని తెలిపారు. మంత్రి సతీమణి రమాదేవి, కుమార్తెలు సింధూర, షరణి సైతం కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కూటమిలో విభేదాలు ఉన్నాయంటూ కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

### దుష్ప్రచారాలను నమ్మొద్దు..

15వ డివిజన్ జనసేన అభ్యర్థి కెజియా కుమారి మాట్లాడుతూ, మంత్రి నారాయణ తమకు గుర్తింపు, గౌరవం ఇస్తూ సహకరిస్తున్నారని తెలిపారు. ఆయనపై జరుగుతున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని, ఎన్నికల్లో తమ అభ్యర్థుల తరఫున ప్రచారం కొనసాగిస్తున్నామని మహిళా అభ్యర్థులు తెలిపారు.

# ఇంటి అద్దె చెల్లించలేక..

## నకిలీ రూ.500 నోట్లు ముద్రించిన వ్యక్తి

ముంబై: అద్దె ఇంట్లో నివసిస్తున్న వ్యక్తి కిరాయి చెల్లించలేక ఇబ్బంది పడ్డాడు. ఈ నేపథ్యంలో ఆ ఇంట్లో రహస్యంగా నకిలీ రూ.500 నోట్లను అతడు ముద్రించాడు. ఇంటి యజమానితో గొడవ పడిన ఆ వ్యక్తి పారిపోయాడు. ఆ ఇంటి తాళం పగులగొట్టి లోపలకు వెళ్లి చూసిన యజయాని నకిలీ రూ.500 నోట్లు ప్రింట్ చేసి ఉండటం చూసి షాక్ అయ్యాడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. నాగ్‌పూర్‌లోని త్రిమూర్తి నగర్‌కు చెందిన పుష్పక్ కృష్ణ భండార్కర్ అలియాస్ బెండానె, ఏడాదిన్నర కిందట ఖర్బీ ప్రాంతంలో ఒక గదిని అద్దెకు తీసుకున్నాడు. అద్దె ఒప్పందం జనవరిలో ముగిసింది. అలాగే గత కొన్ని నెలలుగా ఇంటి యజమానికి అద్దె చెల్లించడం కూడా అతడు ఆపేశాడు. కాగా, ఇంటిని ఖాళీ చేయాలని యజమాని రమేష్ డిమాండ్ చేయగా పుష్పక్ కత్తితో బెదిరించాడు. దీంతో ఇంటి యజమాని పోలీసులను ఆశ్రయించంతో అతడిపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత చాలా కాలంగా పుష్పక్ అద్దె ఇంటికి రాలేదు. ఈ నేపథ్యంలో యజమాని రమేష్ అక్టోబర్ 24న సుత్తితో డోర్ తాళం పగులగొట్టాడు. ఇంటి లోపలకు వెళ్లి చూడగా బకెట్‌లో కరెన్సీ నోట్ల కట్టలు, అక్కడక్కడ పడిఉన్న కాగితపు షీట్‌లు, ఒక ప్రింటర్ ఉండటం చూసి ఆయన షాక్ అయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మరోవైపు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంట్లో నకిలీ రూ.500 నోట్లు ప్రింటింగ్ చేస్తున్నట్లు గ్రహించారు. కౌంటింగ్ యంత్రాన్ని తెప్పించి లెక్కించారు. రూ.37 లక్షల విలువైన నకిలీ నోట్లను పుష్పక్ ముద్రించినట్లు గుర్తించారు. ఒకవైపు పాక్షికంగా ముద్రించిన కరెన్సీ నోట్లు, ప్రింటింగ్ సామగ్రి సహా రూ.48 లక్షల విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న పుష్పక్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. అతడు ముంబైలో ఉన్నట్లు తెలుసుకుని అరెస్ట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

# శ్రీనివాసపురం కాలనీ అభివృద్ధే లక్ష్యం..

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నియోజకవర్గంలోనే నంబర్ వన్ కాలనీగా తీర్చిదిద్దుతాం: అధ్యక్షుడు గాదె సత్యనారాయణ

అందరి సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం.. కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉప్పల్(ప్రశ్న న్యూస్) వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. సంఘం చైర్మన్ కంది అగిరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కాలనీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, కాలనీవాసుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గాదె సత్యనారాయణ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న కాలనీవాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో శ్రీనివాసపురం కాలనీని నియోజకవర్గంలోనే నంబర్ వన్ కాలనీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ కలుపుకొని కాలనీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు.గతంలో సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సమయంలో మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న కాలనీవాసులు తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని గాదె సత్యనారాయణ పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధి కోసం కార్యవర్గ సభ్యులందరూ సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

### నూతన కార్యవర్గం వివరాలు..

అధ్యక్షులు: గాదె సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి: ఇమ్మడి సత్యనారాయణ,సహాయ కార్యదర్శి: మూర్తికోశాధికారి: శ్యామేశ్వర్ రావు,ఉపాధ్యక్షులు: ఆల ముత్యంరెడ్డి, జేరిపోతుల కృష్ణగౌడ్,ఆర్గనైజింగ్ సెక్రటరీలు: సంతోష్, నవీన్, రాజారాం,జాయింట్ సెక్రటరీలు: కొరిచెర్ల రాజేశ్వర్ రావు, కందుకూరి నాగరాజు, శ్రీధర్ రెడ్డి,కన్వీనర్: వినయ్ కుమార్,పబ్లిసిటీ సెక్రటరీ: నాంచారయ్య
సలహాదారులు: కేశవరావు, గాలి శ్రీనివాస్ రావు, కనగిరి, ప్రసాద్, సుబ్బారావు.ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు: మల్లయ్య గౌడ్, శశిధర్ శిల్పి, కాపర్తి శివలింగం,పెరికేటి సుధాకర్చారి , రామరత్నం, నాగభూషణం, ఇ. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, శ్రీనివాస్, అనుముల శ్రీనివాస్, జలంధర్ రెడ్డి, ధీరజ్ ,మహిళా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు:
బాలత్రిపుర సుందరి, అరుణ, శ్రావని, కీర్తన, శారద, గోమతి ఉందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# వృద్ధుడిపై ట్రాఫిక్ పోలీసుల దురుసు ప్రవర్తన

- 74 ఏళ్ల వృద్ధుడిని అసభ్య పదజాలంతో దూషించారంటూ ఆరోపణలు

వాహనం తాళం చెవి, సెల్‌ఫోన్ లాక్కున్నారని కుటుంబ సభ్యుడి ఆవేదన

మెట్టుగూడ చౌరస్తాలో ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని విజ్ఞప్తి



సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. మెట్టుగూడ చౌరస్తాలో 74 ఏళ్ల వృద్ధుడితో చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఆర్ ఏఎస్ఐ ఎం. మహేందర్ అసభ్య పదజాలంతో మాట్లాడినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఓ యువకుడు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో పోలీసుల ప్రవర్తనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### వృద్ధుడితో అలా మాట్లాడటం సమంజసమేనా.?

యువకుడు వెల్లడించిన సమాచారం ప్రకారం, మెట్టుగూడ చౌరస్తాలో తన 74 ఏళ్ల తండ్రితో విధుల్లో ఉన్న ఏఆర్ ఏఎస్ఐ ఎం. మహేందర్ మాట్లాడిన తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని ఆరోపించాడు. పోలీసు అధికారి విధుల్లో ఉన్నప్పటికీ ప్రజలతో గౌరవంగా మాట్లాడటం కనీస బాధ్యత అని, ముఖ్యంగా వృద్ధుల పట్ల సంయమనం, మర్యాద పాటించాలని పేర్కొన్నాడు. తన తండ్రిని అసభ్య పదజాలంతో దూషించారని, వాహనం తాళం చెవి, సెల్‌ఫోన్‌ను లాక్కున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారులు స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరాడు.అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వీడియో, పోలీసుల వివరణ, ఇతర ఆధారాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణల్లోని వాస్తవాలను విచారణ ద్వారా తేల్చాల్సిన అవసరం ఉంది.

### రాత్రివేళ ఆటోల్లో టిఫిన్ సెంటర్లు.. వసూళ్ల ఆరోపణలపై విచారణ ఏదీ.?

మరోవైపు, మెట్టుగూడ చౌరస్తా పరిసరాల్లో రాత్రి సమయాల్లో ఆటోల్లో టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని, ఒక్కో ఆటో నుంచి సుమారు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సహకారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

పోలీసుల విధుల్లో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యం. ట్రాఫిక్ నియంత్రణ పేరుతో ఎవరినీ అవమానించకూడదు. అదే సమయంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ ఆ చర్యలు నిబంధనలకు అనుగుణంగా, గౌరవప్రదంగా ఉండాలి.మెట్టుగూడ ఘటనపై నగర ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు వీడియోను పరిశీలించి, వృద్ధుడి వాంగ్మూలాన్ని తీసుకుని, సంబంధిత పోలీసు అధికారి వివరణతో సహా అన్ని అంశాలను విచారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆటోల్లో టిఫిన్ సెంటర్ల నిర్వహణ, అనుమతులు, అక్రమ వసూళ్ల ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు సేవ చేయాల్సిన వ్యవస్థపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయడం కాకుండా పారదర్శకంగా విచారించి నిజానిజాలను వెల్లడించడమే ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది.

# సింహాచలంలో ఫొటోగ్రాఫర్ల ఆగడాలు

వద్దన్నా వెంటపడుతున్న వైనం

భక్తులకు తప్పని ఇబ్బందులు

గోపురం వద్ద భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం.?

ఫిర్యాదు చేసేందుకు వెళితే

అందుబాటులో లేని అధికారులు

సింహాచలం (ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలోని శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఫొటోగ్రాఫర్ల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వామివారి దర్శనం చేసుకుని బయటకు వస్తున్న భక్తులను ఫొటోలు తీయించుకోవాలని అడుగుతూ కొందరు ప్రైవేటు ఫొటోగ్రాఫర్లు దారికి అడ్డంగా నిలుస్తున్నారని, ఫొటోలు వద్దని చెప్పిన వారితో అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. పవిత్రమైన ఆలయ పరిసరాల్లో భక్తులకు ప్రశాంతంగా రాకపోకలు సాగించే పరిస్థితి కల్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### వద్దన్నా వదలరా.?

అక్టోబరు 25న ఆలయ దర్శనం అనంతరం బయటకు వస్తున్న సమయంలో గోపురం పక్కనే ఫొటోగ్రాఫర్లు భక్తులను ఫొటోలు తీయించుకోవాలని కోరుతూ నిలుచున్నట్లు ప్రత్యక్షంగా గమనించినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఫొటోలు అవసరం లేదని చెప్పిన భక్తుల పట్ల కొందరు ఫొటోగ్రాఫర్లు అభ్యంతరకరంగా వ్యవహరిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. స్వామివారి దర్శనం కోసం కుటుంబాలతో, వృద్ధులతో, పిల్లలతో వచ్చే భక్తులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావడం అసౌకర్యానికి గురిచేస్తోందని చెబుతున్నారు.భక్తులు స్వచ్ఛందంగా ఫొటోలు తీయించుకోవాలనుకుంటే అందుకు అభ్యంతరం లేదు. అయితే ఫొటోలు తీసుకోవాలని ఒత్తిడి చేయడం, వద్దని చెప్పినప్పుడు అనుచితంగా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆలయ పరిసరాల్లో వ్యాపార కార్యకలాపాలు భక్తుల స్వేచ్ఛకు, సౌకర్యానికి భంగం కలిగించకుండా అధికారులు నియంత్రించాల్సిన అవసరం ఉంది.

### భద్రతా సిబ్బంది ఏం చేస్తున్నట్లు.?

గోపురం వెలుపల విధుల్లో ఉన్న ముగ్గురు భద్రతా సిబ్బంది భక్తుల సమస్యను పట్టించుకోకుండా కూర్చుని మాట్లాడుకుంటున్నారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ఫొటోగ్రాఫర్ల వ్యవహారాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినా తగిన స్పందన రాలేదని పేర్కొన్నారు. ఒక భద్రతా సిబ్బంది లేచి విషయాన్ని అడిగేందుకు ప్రయత్నించినా, మిగిలిన ఇద్దరు తిరిగి కూర్చోవాలని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.
ఈ ఆరోపణల్లో వాస్తవాలను ఆలయ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. విధుల్లో ఉన్న సిబ్బంది బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా.? భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందిస్తున్నారా.? ఆలయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి.? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించాలి.

### ఫిర్యాదు చేసేందుకు వెళితే అధికారులేరీ.?

ఫొటోగ్రాఫర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు పీఆర్వో కార్యాలయానికి వెళ్లగా సంబంధిత అధికారులు అందుబాటులో లేరని ఫిర్యాదుదారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలిగినప్పుడు సమస్యను ఎవరికి చెప్పాలి.? తక్షణ పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలి.? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు సేవలు అందించడంతోపాటు వారి సమస్యలను వినేందుకు కూడా సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలి. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, బాధ్యతగల అధికారుల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను స్పష్టంగా అందుబాటులో ఉంచాలి.

### అధికారులు స్పందించాలి.. భక్తులకు ఉపశమనం కల్పించాలి



గోపురం పక్కన ప్రైవేటు ఫొటోగ్రాఫర్ల కార్యకలాపాలకు ఎవరు అనుమతిచ్చారు.? వారు పాటించాల్సిన నిబంధనలు ఏమిటి? భక్తులకు ఇబ్బందులు కలిగితే పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిది.? అనే అంశాలపై దేవస్థానం అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంతంలో ఇలాంటి వ్యాపార కార్యకలాపాలు కనిపించేవి కావని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితులపై విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
సింహాచలం క్షేత్రానికి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే వారికి ప్రశాంతమైన వాతావరణం కల్పించడం దేవస్థానం ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలి. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడటం, ఫొటోలు తీయించుకోవాలా వద్దా అన్న నిర్ణయాన్ని భక్తులకే వదిలేయడం, ఫిర్యాదులపై వెంటనే స్పందించడం అత్యవసరం.

# తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలి

### టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హనుమకొండ(ప్రశ్న న్యూస్) తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన హక్కులు, డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఐక్య ఉద్యమాలు చేపట్టాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ ఉద్యమకారుడు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పిలుపునిచ్చారు.హనుమకొండలోని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కార్యాలయంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన హనుమకొండ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర సన్నాహక సమావేశానికి రాజేష్ ఖన్నా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుడిమల్ల రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదికను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న గుడిమల్ల రవికుమార్ కృషిని రాజేష్ ఖన్నా ప్రత్యేకంగా అభినందించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల న్యాయమైన హక్కులు వారి డిమాండ్ల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యమకారులను సమన్వయం చేసుకుంటూ ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పేర్కొన్నారు.

# చెత్త కుప్పల నుంచి పర్యాటక కేంద్రం

### నెల్లూరు రూపురేఖలు మార్చడమే నారాయణ లక్ష్యం
### దక్షిణ భారతంలోనే భారీ మార్కెట్ యార్డు
### అల్లిపురంలో అమ్యూజ్‌మెంట్ పార్కు
### ఎన్నికల ప్రచారంలో డాక్టర్ సింధూర



నెల్లూరు(ప్రశ్న న్యూస్) అభివృద్ధి పనులతో నెల్లూరు నగరానికి కొత్త రూపు తీసుకొస్తున్నామని మంత్రి నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర అన్నారు. అల్లిపురం డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించి అమ్యూజ్‌మెంట్ పార్కు ఏర్పాటు చేయడం, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు నిర్మాణం నగర అభివృద్ధిలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆదివారం 14, 18వ డివిజన్లలో టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థులు కువారపు బాలాజీ, గొడ్డేటి లక్ష్మితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఘన స్వాగతం పలికి, భారీ గజమాలతో సత్కరించారు.

**వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం..**

నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ మంత్రి నారాయణ చేపట్టిన అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయని సింధూర తెలిపారు. విశాలమైన రహదారులు, పార్కులు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో వార్డులను అభివృద్ధి చేశారని చెప్పారు. నగరంలో 2,500 మొక్కలు నాటడం, ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

**వాణిజ్యానికి కొత్త ఊతం..**

నెల్లూరు ప్రాంతంలో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని సింధూర పేర్కొన్నారు.

**రెండేళ్లలో పర్యాటక నగరంగా..**

అల్లిపురం డంపింగ్ యార్డులో సుమారు 70 లక్షల టన్నుల చెత్తను తొలగించి అమ్యూజ్‌మెంట్ పార్కు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. రానున్న రెండేళ్లలో నెల్లూరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు.నగర అభివృద్ధి కొనసాగేందుకు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు 14వ డివిజన్ అభ్యర్థి కువారపు బాలాజీ, 18వ డివిజన్ అభ్యర్థి గొడ్డేటి లక్ష్మిని గెలిపించాలని సింధూర ఓటర్లను కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి: కేటీఆర్

### రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి యువత కృషి చేయాలి
### యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు



అంబర్‌పేట(ప్రశ్న న్యూస్) యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, యువత సంకల్పిస్తే సాధించలేనిది ఏదీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పార్టీ విజయానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ నాయకుడు బొల్లపల్లి లక్ష్మణ్ రాజును కేటీఆర్‌కు పరిచయం చేశారు. లక్ష్మణ్ రాజు పార్టీలో చురుకుగా పనిచేస్తున్నారని, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారని, పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ వాటిని విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని కాలేరు వెంకటేష్ వివరించారు.అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో యువత పార్టీకి మరింత కీలకంగా మారాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగట్టడంతో పాటు, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో యువత ముందుండి పనిచేయాలని, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా బొల్లపల్లి లక్ష్మణ్ రాజు మాట్లాడుతూ, కేటీఆర్ ప్రసంగం యువతకు దిశానిర్దేశం చేసిందని పేర్కొన్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని, పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు శ్రమిస్తామని తెలిపారు.

# జయహో రామానుజ: సమతా స్ఫూర్తికి, ఆధ్యాత్మిక విప్లవానికి సజీవ దృశ్యకావ్యం





చరిత్రను పుస్తకాల్లో చదవడం ఒక అనుభవమైతే, ఆ చరిత్రను వెండితెరపై సజీవంగా చూడటం ఒక అనిర్వచనీయమైన అనుభూతి. నిన్ననే 'జయహో రామానుజ' చిత్రాన్ని చూసి వచ్చాను. సినిమా చూసి బయటకు రాగానే నా మనసులో మెదిలిన ఒకే ఒక్క ఆలోచన-ఇది కేవలం ఒక సినిమా కాదు, ప్రాచీన కాలపు మహనీయుడి అడుగుజాడలను నేటి యువతకు, భావితరాలకు భద్రంగా అందించే ఒక గొప్ప చారిత్రక దృశ్యకావ్యం.భగవంతుడు అందరికీ చెందాలి, ఆధ్యాత్మిక జ్ఞానం అట్టడుగు వర్గాలకు సైతం అందాలి అనే మహోన్నత ఆశయంతో జీవితాన్ని అంకితం చేసిన భగవద్ రామానుజాచార్యుల వారి చరిత్రను ఈ చిత్రంలో అద్భుతంగా ఆవిష్కరించారు. ముఖ్యంగా సమాజంలో పాతుకుపోయిన అంటరానితనాన్ని రూపుమాపడానికి ఆయన చేసిన నిరంతర కృషి, ఆయన చాటిన సమతా స్ఫూర్తి, మానవతా దృక్పథం నేటి సమాజానికి అత్యంత అవసరం. ఆ మహనీయుని త్యాగాలను, ఆశయాలను ఏ మాత్రం వక్రీకరించకుండా పర్ఫెక్ట్‌గా వెండితెరపై ఆవిష్కరించిన తీరు ఎంతో అద్భుతంగా ఉంది.

**గోపురం ఎక్కి పంచిన తారకమంత్రం**

సినిమాలో రోమాలు నిక్కబొడుచుకునే అత్యంత కీలక ఘట్టం- తన గురువు వద్ద అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశంగా పొందిన సన్నివేశం. "ఈ మంత్రాన్ని ఎవరికైనా చెబితే నువ్వు నరకానికి పోతావు" అని గురువు హెచ్చరిస్తే, "నేనొక్కడిని నరకానికి పోయినా పర్వాలేదు, వేలాది మందికి మోక్షం లభిస్తుంది కదా!" అని ఉదారంగా ఆలోచించిన మహనీయుడు ఆయన. ఆ మరుక్షణమే ఆలయ గోపురం ఎక్కి, కులమత భేదాలు లేకుండా అక్కడున్న వారందరికీ ఆ మంత్రాన్ని బిగ్గరగా వినిపించిన ఆయన త్యాగనిరతిని, దేవుడు ప్రతి ఒక్కరికీ దరిచేరాలనే ఆయన తపనను సినిమాలో చూపించిన తీరు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుంది.

**శ్రీనివాసుని ఉనికిని చాటిన మహానుభావుడు**

తిరుమల శ్రీవారి ఆలయంలో కొలువై ఉన్నది సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే అని లోకానికి స్పష్టంగా తెలియజేసిన ఘట్టం ఈ చిత్రంలో మరో అద్భుతం. గర్భగుడిలో ఆ దేవదేవుడే స్వయంగా శంఖుచక్రాలను ధరించిన దృశ్యాన్ని చూసి, ఆయనే 'శ్రీనివాసుడు' అని మొట్టమొదటిసారిగా గుర్తించిన వ్యక్తి రామానుజాచార్యులే. తిరుమలలో ఆరాధనా విధానాలను, ఆగమ శాస్త్ర నియమాలను ఆయన క్రమబద్ధీకరించిన చరిత్రను నేటి తరానికి ఈ సినిమా ద్వారా కళ్లకు కట్టారు.

**బీబీ నాంచారి ఉదంతం - హద్దులు లేని భక్తి**

ఢిల్లీ సుల్తాన్, బీబీ నాంచారిలకు సంబంధించిన కథ ద్వారా భక్తికి మతం, కులం, ప్రాంతం అనే హద్దులు లేవని ఈ చిత్రంలో స్పష్టంగా చూపించారు. భగవంతుని పట్ల అచంచలమైన ప్రేమ, విశ్వాసం, శరణాగతి అనేవి కేవలం మనిషి అంతరంగానికి సంబంధించినవని ఈ ఘట్టం ద్వారా ఎంతో భావోద్వేగభరితంగా తెరపై ఆవిష్కరించారు.పదకొండు విభిన్న పాత్రల్లో నటిస్తూ, దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన లయన్ డా. సాయి వెంకట్ గారి సాహసం ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. అలాగే ఢిల్లీ సుల్తాన్‌గా సీనియర్ నటుడు సుమన్ గారి రాజసం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక గొప్ప చరిత్రను కమర్షియల్ హంగుల కోసం పాడుచేయకుండా, పాజిటివ్ దృక్పథంతో ఎంతో బాధ్యతగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.మన దేశంలో ఎంతో మంది గొప్ప వ్యక్తులు జన్మించారు. వారు తమ జీవితాల్లో ఎదుర్కొన్న సవాళ్లు, సమాజానికి అందించిన సందేశాలు భావితరాలకు చేరాలి. లావుపాటి పుస్తకాలు చదివే సమయం నేటి యువతకు లేకపోవచ్చు, కానీ 'జయహో రామానుజ' లాంటి ఒక మంచి సినిమా చూసినప్పుడు ఆ మహనీయుడి జీవితం గురించి తెలుసుకోవాలనే స్ఫూర్తి యువతలో ఖచ్చితంగా కలుగుతుంది.సమానత్వం గురించి మాట్లాడటం సులువే, కానీ దాన్ని ఆచరించి చూపించిన ఒక గొప్ప సంస్కర్త జీవితాన్ని వెండితెరపై చూసి తరించడం మన అదృష్టం. ఈ సినిమా యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుంది. ప్రతి ఒక్కరూ చూడాల్సిన, ప్రతి హృదయానికీ చేరాల్సిన అద్భుతమైన చిత్రమిది.

-డా. సింహాచలం లక్ష్మణస్వామి
కవి, రచయిత, విమర్శకులు

# జీహెచ్‌ఎంసీ అధికారులారా.. దీనికి సమాధానం చెప్పండి

### - చట్టాలు కొన్ని నిర్మాణాలకు చుట్టాలుగా మారాయా.? - ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమా.?









మలక్ పేట్ (ప్రశ్న న్యూస్) చట్టం ముందు అందరూ సమానమే మరి చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారుల ముందు మాత్రం కొన్ని నిర్మాణాలు ప్రత్యేకమా.? చార్మినార్ జోన్, మూసారాంబాగ్ సర్కిల్-- 29. మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని ఓ భవన నిర్మాణంపై తలెత్తిన ఆరోపణలు జీహెచ్‌ఎంసీ యంత్రాంగాన్ని నిలదీస్తున్నాయి. ఒకే స్థలానికి రెండు నిర్మాణ అనుమతులు, అనుమతికి మించి అదనపు అంతస్తు నిర్మాణం జరిగిందన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలపై స్పష్టత లేకపోవడం, ఇదంతా అధికారుల దృష్టికి వచ్చినా కూడా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు.? చట్టాలు కొన్ని నిర్మాణాలకు చుట్టాలుగా మారాయా.? అంటూ సోషల్ రిఫార్మర్, విజిల్ బ్లోయర్ సూటిగా ప్రశ్నిస్తున్నారు.

**అనుమతుల మర్మం తేల్చేదెవరు.?**

16-11-405/..కు (2 పర్మిషన్ లు బిల్డింగ్ ఒకటి) కి సంబంధించి 2025 జూలై 11న గుండ్లపల్లి విజయలక్ష్మి, గుండ్లపల్లి వెంకట్ దాస్ పేర్లపై రెండు నిర్మాణ అనుమతులు జారీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతి స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తులకే ఉండగా, స్టిల్ట్ ప్లస్ మూడు అంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు సోషల్ రిఫార్మర్ ఒ విజిల్ బ్లౌర్ ఆరోపణ. రెండు అనుమతులు ఎలా జారీ అయ్యాయి.? స్థల విభజన చట్టబద్ధమేనా.? అదనపు అంతస్తుకు అనుమతి తీసుకున్నారా.? ఇవి చిన్న ప్రశ్నలు కావు. అసలు విషయాలు తెలిస్తే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే.కానీ అధికారులకు మాత్రం ఇవేవి కళ్ళకు కనిపించవు. అంటే అక్రమ నిర్మాణ దారులతో ఎంత స్థాయిలో చేతులు కలిపారో అర్థం చేసుకోవచ్చు.

**మాటల్లో కాదు, చేతల్లో చూపించండి..**

"చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని చెప్పడం అధికారులకు సులువు డైలాగ్ గా మారింది కానీ ఆ చట్టాన్ని అమలు చేయాల్సిన యంత్రాంగం తన బాధ్యతను నిర్వర్తిస్తుందా లేదా అన్నదే ఇప్పుడు కీలకం. సంబంధిత భవనంపై సంయుక్త తనిఖీలు నిర్వహించి, అనుమతులు,నిర్మాణ ప్రణాళికలు,క్షేత్రస్థాయి పరిస్థితులను పోల్చి చూడాలని మూసారాంబాగ్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను బహిర్గతం చేయాలని కోరారు.

**అధికారులారా, సమాధానం చెప్పండి..**

రెండు అనుమతుల వ్యవహారంలో వాస్తవాలేమిటి.? అదనపు అంతస్తు నిర్మాణానికి అనుమతి ఉందా.? ఫిర్యాదులపై ఇప్పటివరకు ఏం చేశారు.? చర్యలు తీసుకోకపోతే ఎందుకు తీసుకోలేదు.? నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకుంటారా.? బాధ్యతలో నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులపై కూడా విచారణ ఉంటుందా.? ప్రజలకు ఈ వివరాలు తెలుసుకునే హక్కు ఉంది. ఆరోపణలను రికార్డులు, క్షేత్రస్థాయి తనిఖీలతో తేల్చి, నిజానిజాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత జీహెచ్‌ఎంసీ అధికారులపై ఉంది.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు మంత్రుల శంకుస్థాపన

### - పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం
### - రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్



జగిత్యాల (ప్రశ్న న్యూస్)పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైందని తెలిపారు. పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ విద్య ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న విషయం స్పష్టమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసన్నాంబ, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు,నారాయణ రెడ్డి , సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# థర్డ్ ఫ్రంట్ దిశగా కేసీఆర్ అడుగులు.?

## - ఢిల్లీ కేంద్రంగా రాజకీయ వ్యూహం.. కేటీఆర్ సంకేతాలేంటి.?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు త్వరలోనే జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారి, ఢిల్లీ పీఠాన్ని శాసించే స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం రేపాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన అంబర్‌పేట్ నియోజకవర్గ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బలహీనపడుతోందని, అటు ప్రతిపక్ష కాంగ్రెస్ వైఫల్యాల వల్ల దేశంలో కాంగ్రెసేతర, బీజేపీయేతర శక్తుల అవసరం త్వరలోనే పరాకాష్టకు చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలో కేసీఆర్ మళ్లీ కీలకపాత్ర పోషిస్తారని స్పష్టం చేయడం గులాబీ శ్రేణుల్లో నయా ఉత్సాహాన్ని నింపింది.

### - కేసీఆర్ అసలు వ్యూహం ఏమిటి.?

కేటీఆర్ వ్యాఖ్యల కోసం థర్డ్ ఫ్రంట్ కోసం తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అభిప్రాయం బలపడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో బీజేపీ సొంత మెజారిటీ కోల్పోయి మిత్రపక్షాలపై ఆధారపడాల్సి రావడం, మరోవైపు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో అంతర్గత విభేదాలు బయటపడుతుండటం వంటి పరిణామాలను బీఆర్ఎస్ నిశితంగా పరిశీలిస్తోంది. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ నాయకత్వం వైఫల్యం చెందిందని భావిస్తున్న అనేక ప్రాంతీయ పార్టీలకు బలమైన, అనుభవజ్ఞుడైన ప్రత్యామ్నాయ నాయకత్వం అవసరంగా మారింది. ఈ ఖాళీని భర్తీ చేయడానికే కేసీఆర్ జాతీయ వేదికపై నాన్-కాంగ్రెస్, నాన్-బీజేపీ ఫ్రంట్‌ను మళ్లీ తెరపైకి తెచ్చే వ్యూహంతో ఉన్నారని తెలుస్తోంది.

### - కేసీఆర్ ఇమేజ్ నేషనల్ వైడ్ అని చెప్పే ఉద్దేశం

కేటీఆర్ చేసిన ఈ నేషనల్ పొలిటికల్స్ వ్యాఖ్యలు కేవలం జాతీయ స్థాయి కోసమే కాకుండా, తెలంగాణ స్థానిక రాజకీయాలకు కూడా ముడిపడి ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో ఓటమి, అనంతరం పలువురు ఎమ్మెల్యేలు పార్టీ మారడంతో తీవ్ర నైరాశ్యంలో ఉన్న బీఆర్ఎస్ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి ఇది ఒక బలమైన ఆత్మవిశ్వాస అస్త్రంగా ఉపయోగపడుతుంది. త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల సమరంలో శ్రేణులను క్రియాశీలంగా ఉంచేందుకు కేసీఆర్ జాతీయ రీ-ఎంట్రీ, మళ్లీ కేసీఆరే సీఎం అవుతారు అనే ప్రచారాన్ని బీఆర్ఎస్ నాయకత్వం వ్యూహాత్మకంగా వాడుకుంటోంది.

### - కొన్ని పార్టీలతో కేసీఆర్ టచ్‌లో ఉన్నారా.?

ఢిల్లీ పీఠాన్ని ప్రభావితం చేసే సత్తా ఉన్న తతంగం కోసం కేసీఆర్ ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, జేడీఎస్, బిజూ జనతాదళ్, వైఎస్ఆర్‌సీపీ వంటి ఇతర రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల అగ్రనేతలతో కమ్యూనికేషన్ మార్గాలను పునరుద్ధరించే ప్రయత్నాల్లో ఉన్నట్లు పొలిటికల్ సర్కిళ్లలో ప్రచారం సాగుతోంది. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిధుల పంపిణీలో రాష్ట్రాలపై జరుగుతున్న వివక్షను ప్రధాన అస్త్రంగా చేసుకుని, ప్రాంతీయ ఆత్మగౌరవ నినాదంతో ప్రాంతీయ పార్టీలను ఒకే తాటిపైకి తెచ్చేందుకు తెరవెనుక నెట్‌వర్కింగ్ వేగవంతమైందనే అభిప్రాయాలు ఉన్నాయి.

### - తేలికగా తీసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

తెలంగాణలో అధికారాన్ని కోల్పోయి, అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న బీఆర్ఎస్ నేతలు ప్రజల దృష్టిని మరల్చడానికే జాతీయ రాజకీయాలంటూ కొత్త నాటకాలాడుతున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. బిఆర్ఎస్ ఉనికికే ముప్పు ఏర్పడిన తరుణంలో జాతీయ స్థాయిలో మూడో కూటమిని నిర్మించడం సాధ్యపడదని, గతంలో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినా దేశవ్యాప్తంగా ఎలాంటి ప్రభావం చూపలేకపోయారని ప్రత్యర్థులు గుర్తుచేస్తున్నారు. కేసీఆర్ జాతీయ రీ-ఎంట్రీ ప్రకటన వెనుక అటు జాతీయ స్థాయిలో మారిన రాజకీయ సమీకరణాలను పసిగట్టడమే కాకుండా, ఇటు తెలంగాణలో రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికల్లో పార్టీ ఆధిపత్యాన్ని

నిలబెట్టుకునే ద్విముఖ వ్యూహం ఉంది. రాబోయే రోజుల్లో కేసీఆర్ నేరుగా ఢిల్లీ పర్యటనలు చేపట్టి ఇతర ప్రాంతీయ నేతలతో సమావేశమవుతారా లేక కేవలం తెలంగాణ సభలకే పరిమితమవుతారా అనేది తేలితేనే ఈ థర్డ్ ఫ్రంట్ వ్యూహం ఎంతవరకు కార్యరూపం దాలుస్తుందో స్పష్టత రానుంది.

# ఓటీటీ ఎంట్రీ ఇస్తున్న మెగాస్టార్ చిరంజీవి

## - నెట్‌ఫ్లిక్స్‌లో 'మెగావర్స్' పేరుతో ప్రత్యేక టాక్ షో



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మెగాస్టార్ చిరంజీవి వెండితెరపైనే కాకుండా ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైనా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఒక సరికొత్త సెలబ్రిటీ టాక్ షోతో ఓటీటీ అరంగేట్రం చేయనున్నారు. ఈ ఆసక్తికరమైన షోకు 'మెగావర్స్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఈ వార్తతో మెగా అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ టాక్ షో ద్వారా చిరంజీవి తన ఐదు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రయాణం, రాజకీయ జీవితంలోని కీలక ఘట్టాలు, చిత్ర పరిశ్రమలో తన అనుభవాలను ప్రేక్షకులతో పంచుకోనున్నారు. ముఖ్యంగా, ఇప్పటివరకు ఆయన బహిరంగంగా ఎక్కడా వెల్లడించని ఎన్నో వ్యక్తిగత విషయాలను, ఆసక్తికరమైన సంఘటనలను ఈ షోలో ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. ఇది ఆయన జీవితంలోని మరో కోణాన్ని అభిమానులకు పరిచయం చేయనుంది. సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు ఇలా ఓటీటీలో ప్రత్యేక షోతో ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'మెగావర్స్' షో ద్వారా చిరంజీవి చెప్పబోయే తెలియని నిజాలు, పంచుకోబోయే అనుభవాల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ షోకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి.

# దయచేసి రిటర్న్ వద్దు సార్

## - ఫ్లిప్‌కార్ట్ కస్టమర్‌ను వేడుకున్న సెల్లర్!




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆన్‌లైన్ షాపింగ్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో ఓ కస్టమర్‌కు వింత అనుభవం ఎదురైంది. తాను ఆర్డర్ చేసిన టీ-షర్ట్ పార్శిల్‌లో, విక్రయదారుడు రాసిన ఓ అభ్యర్థన లేఖ చూసి అతను ఆశ్చర్యపోయాడు. ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే, కల్పేష్ అనే ఓ నెటిజన్ ఫ్లిప్‌కార్ట్‌లో టీ-షర్ట్ ఆర్డర్ చేశాడు. పార్శిల్ ఓపెన్ చేయగా, అందులో టీ-షర్ట్‌తో పాటు ఓ చేతిరాత నోట్ ఉంది. దానిపై, "దయచేసి ఈ ప్రొడక్ట్ రిటర్న్ చేయొద్దు సార్. నేను ఇప్పటికే నష్టాల్లో ఉన్నాను, దయచేసి రిటర్న్ వద్దు" అని రాసి ఉంది. ఈ నోట్‌ను ఫోటో తీసి కల్పేష్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్ అయింది.ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. చాలా మంది చిన్న విక్రయదారుల పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. ఫ్లిప్‌కార్ట్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో రిటర్న్‌ల వల్ల అయ్యే అధిక ఖర్చులు, ఫీజుల భారం చిన్న వ్యాపారులపైనే పడుతుందని పలువురు కామెంట్ చేశారు. కొందరు కస్టమర్లు వాడిన వస్తువులను కూడా రిటర్న్ చేస్తుండటంతో తాము నష్టపోతున్నామని విక్రయదారులు వాపోతున్నట్లు చర్చ జరుగుతోంది. కొందరు దీన్ని సరదాగా తీసుకున్నప్పటికీ, చాలామంది ఇది విక్రయదారుడి ఆర్థిక ఇబ్బందులకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఏదేమైనా, ఈ చిన్న లేఖ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో చిన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న సవాళ్లను, ముఖ్యంగా రిటర్న్‌ల సమస్యను మరోసారి వెలుగులోకి తెచ్చింది.

# నీటి వృథా చేస్తే రూ.5 వేల జరిమానా

## - రెండోసారి తప్పు చేస్తే ట్యాంకర్ రిజిస్ట్రేషన్ రద్దు- నవంబర్ 1 నుంచి జలమండలి కఠిన నిబంధనలు అమలు

## - ట్యాంకర్లలో ఓవర్‌ఫిల్లింగ్, లీకేజీలపై ప్రత్యేక నిఘా - నిబంధనలు పాటించకుంటే ఫిల్లింగ్ స్టేషన్లలో నీటి నింపుదలకు నో



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు జలమండలి కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. ట్యాంకర్ల ద్వారా నీటిని రవాణా చేసే సమయంలో జరుగుతున్న వృథాను నియంత్రించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. ట్యాంకర్లలో సామర్థ్యానికి మించి నీటిని నింపడం, మూతలు సరిగా లేకపోవడం, లీకేజీల కారణంగా విలువైన తాగునీరు రహదారులపై వృథాగా పోతున్నట్లు గుర్తించిన జలమండలి.. ఇకపై ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అక్టోబర్ 24న సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### - నవంబర్ 1 నుంచి జరిమానాలు

ట్యాంకర్ల ద్వారా నీటి వృథాకు పాల్పడినట్లు గుర్తిస్తే 2026 నవంబర్ 1 నుంచి సంబంధిత ట్యాంకర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధించనున్నారు. అదే ట్యాంకర్ రెండోసారి నిబంధనలను ఉల్లంఘిస్తే దాని రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయనున్నారు. నీటి లీకేజీలు ఉన్న ట్యాంకర్లు, మూతలు లేని లేదా సరిగా మూసివేయని ట్యాంకర్లకు ఫిల్లింగ్ స్టేషన్లలో నీటిని నింపేందుకు అనుమతించకూడదని జలమండలి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

### - ఓవర్‌ఫిల్లింగ్‌తో రహదారులపై నీటి వృథా

జలమండలి పరిధిలోని కొన్ని ట్యాంకర్లలో సామర్థ్యానికి మించి నీటిని నింపడం, ట్యాంకర్ల మూతలు సరిగా మూసివేయకపోవడం వల్ల రవాణా సమయంలో నీరు రహదారులపై ప్రవహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల తాగునీరు వృథా కావడమే కాకుండా వాహనదారులకు ఇబ్బందులు, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ట్యాంకర్లలో నీటి నింపుదల నుంచి రవాణా వరకు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు.

### - ఫిల్లింగ్ స్టేషన్లలో తనిఖీలు

అన్ని ఫిల్లింగ్ స్టేషన్ల మేనేజర్లు, ఇన్‌చార్జ్‌లు ట్యాంకర్లలో నీటిని నింపే ముందు లీకేజీలు ఉన్నాయా.? మూతలు సక్రమంగా పనిచేస్తున్నాయా.? అనే అంశాలను పరిశీలించాలి. లోపాలు గుర్తిస్తే వాటిని సరిచేసే వరకు నీటిని నింపేందుకు అనుమతించకూడదు. ఈ నిబంధనల అమలును సంబంధిత డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు పర్యవేక్షించాలని జలమండలి ఆదేశించింది. ట్యాంకర్ అసోసియేషన్లు కూడా తమ సభ్యులకు నిబంధనలపై అవగాహన కల్పించి, నీటి వృథా నివారణకు సహకరించాలని కోరింది.

### - నీటి పొదుపే లక్ష్యం

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యం పెరిగింది. తాగునీటిని పొదుపుగా వినియోగించాలని, విద్యుత్ ఆదా విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి సూచించిన నేపథ్యంలో జలమండలి చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ప్రజలకు సరఫరా చేసే ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవడం ట్యాంకర్ యజమానులు, డ్రైవర్ల బాధ్యత అని స్పష్టం చేసింది. నీటి వృథా నివారణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

# రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దు

## - మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ** దేశాలు తమ లక్ష్యాల కోసం ఉగ్రవాదాన్ని ఓ సాధనంగా చూడకూడదని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ హితవు పలికారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవంలో ప్రసంగించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ఏరకంగా సమర్థించలేమని చెప్పారు. టెర్రరిజాన్ని ఏమాత్రం సహించకూడదని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని ఉపేక్షించకూడదని ప్రపంచదేశాలకు స్పష్టం చేశారు. తమకు అన్ని దేశాలతో సంబంధాలు తప్పదంటూ పాక్‌తో దౌత్యాన్ని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి సమర్థించుకున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.చరిత్ర నేర్పించిన పాఠాలను కొన్ని దేశాలు రాజకీయ కారణాలతో పక్కన పెట్టేస్తున్నాయని మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షిస్తున్నాయని అన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతర్జాతీయ సమాజం కఠిన వైఖరి అవలంబించాలని చెప్పారు.ప్రపంచం ఉమ్మడిగా ఎదుర్కొంటున్న ముప్పు ఉగ్రవాదని మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించారు. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి ఉగ్రవాదం కట్టడికి తమ నిబద్ధతను చాటుకోవాలని ప్రపంచదేశాలకు పిలుపునిచ్చారు.

### యుద్ధం ఏ మూలన జరిగినా అందరికీ ముప్పే..

యుద్ధాలతో ప్రపంచ ఆర్థిక రాజకీయ పరిస్థితులపై విస్తృత ప్రతికూల ప్రభావం పడుతోందని మంత్రి అన్నారు. యుద్ధం ఎక్కడ జరిగినా ప్రపంచమంతా అశాంతి నెలకొంటుందని హెచ్చరించారు. ప్రస్తుత ఇరాన్, యుక్రెయిన్ యుద్ధాలకు చర్చలు, దౌత్యమే పరిష్కారమని మరోమారు స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో జలమండలి అధికారి

### - కారులో రూ.2.40 లక్షలు

### - లెక్కల్లో లేని నగదు పట్టివేత




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులకు మరో అవినీతి చేప చిక్కింది. ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డులో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏ. శ్రీనివాస్ వద్ద లెక్కల్లో లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న కారులో రూ.2.40 లక్షల నగదు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఆ సొమ్ముకు సంబంధించి ఆయన ఇచ్చిన సమాధానాలపై అనుమానాలు వ్యక్తం కావడంతో నగదును సీజ్ చేసి తదుపరి విచారణ చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఏసీబీ సిటీ రేంజ్-2 బృందానికి వచ్చిన అజ్ఞాత సమాచారం ఆధారంగా అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో రాజ్‌భవన్ రోడ్డులోని మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా మారుతి స్విఫ్ట్ కారును నిలిపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ వాహనం జలమండలి జాయింట్ డైరెక్టర్ ఏ. శ్రీనివాస్‌కు చెందినదిగా గుర్తించారు. కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం.కారు తనిఖీ చేయగా రూ.2,40,000 నగదు లభ్యమైంది. ఆ మొత్తానికి సంబంధించి అధికారులు ప్రశ్నించగా శ్రీనివాస్ సరైన వివరణ ఇవ్వలేకపోయినట్లు ఏసీబీ వెల్లడించింది. ఆయన సమాధానాల్లో పొంతన లేకపోవడంతో నగదు మూలాలపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో నిబంధనల ప్రకారం పంచనామా నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై మరింత విచారణ జరిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన వివరాలను ఆదాయపు పన్ను శాఖకు కూడా తెలియజేయనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. నగదు ఎక్కడి నుంచి వచ్చింది ? దానిని ఏ అవసరానికి తీసుకెళ్తున్నారు ? అనే అంశాలపై తదుపరి విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు అవినీతి నిరోధక శాఖ తనిఖీలు కీలకంగా నిలుస్తున్నాయి. ఇటీవల కాలంలో వరుసగా ప్రభుత్వ అధికారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహిస్తున్నారు. పలువురు అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేయటంతో పాటు రిమాండ్‌కు తరలించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588